J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 30 30.12.2022, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి

సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నేతలకు చెలగాటం.. అధికారులకు ఇరకాటం!

### ► రాజకీయ వర్గపోరు మధ్య ఉద్యోగులు అల్లాడిపోతున్నారు

'నారీ నారీ నడుమ మురారి'... ఇదీ అనాదిగా వస్తున్న సామెత. ఇద్దరు యువతుల మధ్య నలిగే మగవాడి గురించి వాడే మాట. కానీ, ప్రస్తుతం ఆంధ్రాలో అధికారుల పరిస్థితి అది కాదు. ఇక్కడ 'నేత నేత నడుమ వాత' అన్నట్లుగా తయారైందని ఉన్నత స్థాయి సీనియర్ ప్రభుత్వ ఉద్యోగులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఒకే పార్టీలో ఉంటూనే జుట్లు పట్టుకుంటున్న అధికారపార్టీ నేతల పోకడ తమకు తలనొప్పిగా మారిందని బాధపడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో(డెమోక్రసీ)లో నాయకులు శాశ్వతం కాదు. ప్రతీ ఐదేళ్లకు వచ్చే ఎన్నికలలో కొంతమంది పాతవాళ్ళు తెరమరుగై, కొత్తవాళ్ళు తెరపైకి వస్తుంటారు. గెలిచిన పార్టీ అధినాయకుడి పాలనని బట్టి ఆ నాయకుడికి మళ్ళీ అధికారం కట్టబెట్టాలా..? లేదా...?? అన్న విషయం ప్రజలు నిర్ణయిస్తారు. అధినేత చరిష్మాపైనే మిగిలినవారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

10 లో



## రాజ్యసభకి వై.వి.సుబ్బారెడ్డి శ్రీవారి సేవకి కరుణాకరరెడ్డి?



తిరుమల తిరుపతి దేవస్థానాలకు త్వరలో కొత్త పాలకమండలి ఏర్పడనున్నట్లు తాడేపల్లి వర్గాల సమాచారం. సుబ్బారెడ్డికి రాజకీయ ప్రాధాన్యత కల్పించి 2024లో రాజ్యసభకు పంపిస్తారని వార్త. ఇదే క్రమంలో తిరుపతి శాసనసభ్యులు, జగన్ మరో సమీప బంధువు, టీటీడీ మాజీఛైర్మెన్ భూమన కరుణాకరరెడ్డిని మళ్ళీ తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్‌గా నియమించి స్వామివారి సేవాభాగ్యాన్ని కల్పిస్తారని కూడా పుకార్లు షికారు చేస్తున్నాయి. జనవరి 3వ వారంలో నూతన పాలకమండలి ఏర్పడవచ్చని తెలుస్తోంది.

2019లో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే వై.వి.సుబ్బారెడ్డిని టీటీడీ ఛైర్మెన్‌ని చేసి స్వామివారి సేవకోసం నియమించారు. 2009లో రాజశేఖరరెడ్డి దివంగతులైన నాటి నుండి తన శ్వాస, ధ్యాస అంతా జగనే అన్నట్లుగా ఆయన విజయం కోసం దశాబ్దకాలం

10 లో






## 'విశ్వవైద్య విభూషణుడు' మన ప్రేమసాగరుడు

ఆనంద సంబరంగా.. ఆత్మీయ సంరంభంగా
డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి 'పౌరసన్మానం'
మరియు బిరుదు ప్రదాన మహోత్సవం

(వివరాలు 6,7 పేజీల్లో)



అనితరసాధ్యుడికి
అభినందన శుభాకాంక్షలు

అనన్యసామాన్యుడు, అనితరసాధ్యుడు
దయార్ద్రహృదయుడు, సేవాపరాయణుడు
అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మన నెల్లూరీయుడు
డా॥ ప్రేమసాగర్‌రెడ్డి గారు
డిసెంబర్ 26వ తేదీ నెల్లూరులో
'పౌరసన్మానం'
మరియు
'విశ్వవైద్య విభూషణ్'
బిరుదు అందుకున్న సందర్భంగా
అభినందన శుభాకాంక్షలు.



బీద మస్తాన్‌రావు
రాజ్యసభ సభ్యులు

# నెల్లూరు కబుర్లు

## డిసెంబరు 30న..
# జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

జిల్లాపరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు డిసెంబరు 30న నిర్వహించనున్నామని, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారని, సభ్యులు, సంబంధిత అధికారులందరూ హాజరుకావాలని జడ్పీ సిఇఓ బి.చిరంజీవి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నవల, 'నానీ'లకు.. అవార్డుల ప్రదానం



నెల్లూరుకు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నివాసంలో ఇటీవల స్వర్గీయ జమున స్మారక జాతీయ స్థాయి నానీల పురస్కారం, మరియు డాక్టర్ జయప్రద నవలా పురస్కార సభ.. పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. డాక్టర్ పెళ్ళకూరు జయప్రద రచించిన 'వైద్య పరిజ్ఞానం-ఇంట్లో ఆరోగ్యం' పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు ప్రముఖ రచయిత కాళిదాసు పురుషోత్తం పుస్తకావిష్కరణ చేశారు. ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం మొదటి ప్రతిని స్వీకరించగా, సభకు అవ్వారు శ్రీధర్‌బాబు అధ్యక్షులుగా వ్యవహరించారు. నవలా పురస్కారం గ్రహీత ప్రభాకర్ జానీ, 'అమ్మ 'నానీల రచయిత పుచ్చకాయల బ్రహ్మాజీ రావులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వారు రచించిన 'హీరో' నవలను శిరంశెట్టి కాంతారావు, 'అమ్మ' నానీలను కొండ్రెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి సమీక్ష చేశారు. కవులు, కవయిత్రులు గోవిందరాజు సుబ్రాదేవి, కోసూరు రత్నం, పెరుగు రామకృష్ణ, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# మానవీయతకు వీరు మారుపేరు

## డాక్టర్ ప్రేమ్‌రెడ్డి కుటుంబసభ్యుల 'వాత్సల్యం'

ప్రపంచప్రఖ్యాతిపొందిన వైద్యులు, విశ్వవైద్య విభూషణులు డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డికి పౌరసన్మానాన్ని పురస్కరించుకుని ఆయన సతీమణి డాక్టర్ శాంతిరెడ్డి, వారి కుమార్తెలు కవితారెడ్డి, సునీతారెడ్డి, కుమారుడు అశోక్‌రెడ్డి వారి కుటుంబసభ్యులంతా కలిసి ఈనెల 26న నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు నగరంలోని 'వాత్సల్య' నిరాధారబాలల ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడున్న చిన్నారులు, వృద్ధులతో చాలాసేపు కలిసి ముచ్చటించి, వారితో మమేకమయ్యారు. ఆ చిన్నారులు భగవద్గీత శ్లోకాలు గడగడా చెప్తుంటే ఆసక్తిగా విన్నారు. వారి ప్రతిభాపాటవాలను మెచ్చుకుంటూ, ఆ పిల్లల్లో మరింత స్ఫూర్తిని కలిగించారు. వారితోపాటే నేలమీద కూర్చుని, ఎంతో సంతోషంగా ఆ చిన్నారులతో కలసిపోవడం అక్కడున్న వారందరికీ ఎంతో ఆశ్చర్యం కలిగించింది. అమెరికాలో అగ్రశ్రేణి వైద్యులుగా, అనేక ఆసుపత్రులకు అధినేతలుగా ఉన్న డాక్టర్ ప్రేమ్‌రెడ్డి కుటుంబసభ్యులు ఇలా ఎంతో నిరాడంబరంగా, అనాథపిల్లల తోనూ అరమరికలు లేకుండా మాట్లాడడం ఆ కుటుంబం మానవీయతకు నిదర్శనమంటూ అక్కడున్న ఉపాధ్యాయులంతా కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య నిర్వాహకులు జివి సాంబశివరావు, బిజెపి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరునికి..8.2 లక్షల రాబడి

నెల్లూరు మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో డిసెంబరు 28న ఆలయ హుండీలు లెక్కించగా అక్టోబరు 15 నుంచి ఇప్పటిదాకా 8,20,415 రూపాయలు రాబడి వచ్చిందని ఆలయ ఇఓ వేణుగోపాల్ తెలిపారు. దేవాదాయశాఖ అధికారి చైతన్య పర్యవేక్షించారు.

# చదువుకుంటేనే జీవితానికి రాణింపు



చదువుకుంటేనే ఎవరి జీవితమైనా రాణిస్తుందని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని బివిఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 27న విద్యార్థులకు టాబుల పంపిణీ కార్యక్రమంలో ఆదాల పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక విజ్ఞానంలో బాగా ఎదగాలని, అప్పుడే పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోగలరని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నాడు-నేడు' కింద స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు.

# కన్నులపండువగా.. క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా డిసెంబరు 25న నెల్లూరు నగరంలోని అన్ని చర్చిల్లో కన్నులపండువగా వేడుకలు జరిగాయి. ఒకరికొకరు సంతోషంగా క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కుటుంబాలతో సహ అందరూ చర్చిలకు తరలివెళ్ళి ఎంతో భక్తిశ్రద్ధలతో ఏసుక్రీస్తును ధ్యానించుకుంటూ ప్రార్థనలు చేశారు. పాస్టర్ల సందేశాలను ఆసక్తిగా విన్నారు. అనేకమంది ఏసుక్రీస్తు భక్తిగీతాలను, కీర్తనలను హృద్యంగా ఆలపించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిల నిర్వాహకులు, దాతలు సేవా కార్యక్రమాలను నిర్వహించి అభాగ్యులకు చేయూతనందించారు. వస్త్రదానం, అన్నదానం వంటి కార్యక్రమాలను విరివిగా చేపట్టారు. కులమతాలకు అతీతంగా పెద్దసంఖ్యలో నాయకులు, ప్రజలు కూడా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు చెప్తూ, ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## డౌనీహాల్ సేవలు

క్రిస్మస్ సందర్భంగా నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని బాప్టిస్టు చర్చి డౌనీహాల్ వారి సేవాకార్యక్రమాల్లో భాగంగా పలువురు రోగులకు ఇటీవల పౌష్టికాహారం పంపిణీ చేసి కొత్త వస్త్రాలను అందజేశారు. డౌనీహాల్ కార్యదర్శి జి.అరుణ్‌కుమార్, సంఘపెద్దలు చక్రపాణి, జార్జ్ స్టీవెన్సన్, వరప్రసాద్, దినేష్, విజయపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్‌కు..11 అవార్డులు




డిసెంబరు 24, 25 తేదీల్లో నెల్లూరులో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్‌లో కన్వెన్షన్-2022లో స్థానిక ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌కు అత్యధిక అవార్డులు లభించాయి. ఉత్తమ సామాజిక సేవ, విరాళాల సేకరణ తదితర అన్ని విభాగాల్లో మొత్తం 11 అవార్డులు సాధించడం విశేషం. దీంతో బెస్ట్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా కొండూరు సుబ్బారావు, బెస్ట్ ఇంటర్నేషనల్ ట్రెజరర్‌గా నలుబోలు బలరామయ్యనాయుడు, అత్యుత్తమ సేవలందించిన పలగాటి శ్రీనివాసులురెడ్డి, వినుకొండ వెంకటేశ్వర్లు తదితరులకు అవార్డులు లభించాయి. వాకర్స్ ప్రతినిధులు, నిర్వాహకులు వీరందరినీ అభినందించారు.

# ప్రజల కష్టాల్లో అండగా ఉంటాం

ప్రజల కష్టాల్లో తామంతా అండగా ఉంటామని జనసేన జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి చెప్పారు. డిసెంబరు 28న నెల్లూరులోని 27వ డివిజన్‌కు చెందిన పలువురు జనసేనలో చేరడంతో ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలు కన్నీళ్ళే మిగులుతున్నాయని విమర్శించారు. కక్షసాధింపులు తప్ప జగన్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు.

## జనవరి 5న..
# ప్రెస్ అకాడమీ ఛైర్మన్ రాక

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జనవరి 5న నెల్లూరుకు వస్తున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు విక్రమసింహపురి యూనివర్శిటీకి వచ్చి, జర్నలిజంలో డిప్లొమా కోర్సులపై చర్చించి అనంతరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడతారని, 6వ తేదీ ఉదయం ఒంగోలుకు బయలుదేరి వెళ్తారని సమాచారం.

## నేత్రపర్వం..
# అయ్యప్పస్వామి నగరోత్సవం

నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న మండల పూజల్లో భాగంగా డిసెంబరు 28న స్వామివారి నగరోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కేరళ వాద్యాలు, కోలాటాలు, భక్తుల శరణుఘోషల నడుమ స్వామివారి ఊరేగింపు నయనానందకరంగా సాగింది. ఆలయ పాలకమండలి అధ్యక్షులు జి.శేషగిరిరావు ఈ వేడుకలను పర్యవేక్షించారు.


## ఉత్తరక్రియలు



మా ఇంటి దైవం
**శ్రీ పులిమి సురేష్ (పెద్ద బుల్లి) గారు**
తేది. 24.12.2022 శనివారం స్వర్గస్తులైనారు
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
భార్య : డా. పద్మ మరియు కుటుంబసభ్యులు

వారి పెద్దకర్మ తేది. 05.01.2023 ఉదయం 10గం.లకు నెల్లూరు, ఆదిత్యనగర్ వాటర్ ట్యాంక్ దగ్గర గల డా. బాలసుబ్రహ్మణ్యం పార్క్‌ను ఆనుకొని ఉన్న రెడ్డి & రెడ్డి కాలనీలోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది. సెల్. 9566839839



# విషాదంలో కూరుకుపోయిన.. కందుకూరు

- చంద్రబాబు పర్యటనలో తొక్కిసలాట
- 8 మంది దుర్మరణం

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కందుకూరు పర్యటన విషాదంగా మిగిలింది. డిసెంబరు 28న ఆయన నెల్లూరుజిల్లాలోని కందుకూరుకు రావడంతో కార్యకర్తల తొక్కిసలాట జరిగి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. పెద్దఎత్తున వచ్చిన వాహనశ్రేణి కందుకూరుకు చేరుకుంది. రోడ్‌షోకు భారీగా జనం తరలిరావడంతో జరిగిన తొక్కిసలాటలో ఒకరిపై ఒకరు కాలువలో పడిపోయి అనేకమంది ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్ళారు. మొత్తం 13 మందిని వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్ళగా, చికిత్స పొందుతూ 8 మంది మరణించారు. మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సత్వర చికిత్సలు చేస్తున్నారు. ఈ దుర్ఘటనతో చంద్రబాబు విషాదవదనంతో బాధితులను పరామర్శించారు. మృతులకు నివాళు లర్పించి, వారి కుటుంబాలకు 10 లక్షల రూపాయల వంతున సాయం ప్రకటించారు. అనంతరం ఆయన తన సభను విరమించుకుని వెళ్ళిపోయారు.

## కందుకూరు దుర్ఘటనకు..

# బాబే కారణం

### మంత్రి కాకాణి ఆరోపణలు



కందుకూరు దుర్ఘటనకు చంద్రబాబునాయుడే కారణమని ఆరోపిస్తూ, ఈ ఘటనలో 8మంది మరణించడం బాధాకరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. డిసెంబరు 29 గురువారం ఆయన నెల్లూరులోని వైకాపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనం అధికంగా వచ్చినట్లు చూపించాలనే ప్రయత్నంలో ఇరుకు సందుల్లో జనాభాను తరలించడం వల్లనే మరణాలు సంభవించాయని ఆయన అన్నారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని, గోదావరి పుష్కరాల సందర్భంగా అక్కడ ఎక్కువ మంది మరణించడానికి చంద్రబాబే కారణమన్నారు. కందుకూరులో 8 మంది మరణించడానికి ప్రధాన కారణమైన చంద్రబాబుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.



# శ్రీసిటీలో.. మహిళలకు ప్రాధాన్యత అభినందనీయం

- ప్రశంసించిన డాక్టర్ శాంతి ప్రేమ్‌సాగర్‌రెడ్డి



అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన పారిశ్రామికవాడ.. శ్రీసిటీలో పెద్దసంఖ్యలో మహిళలకు ఉద్యోగ ఉపాధులు కలగడం పట్ల డాక్టర్ శాంతిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. స్థానికులకు, ముఖ్యంగా మహిళలకు ఉద్యోగాలిచ్చి అండగా నిలుస్తున్న శ్రీసిటీని ఆమె ప్రశంసించారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన వైద్యులు, 'విశ్వవైద్య విభూషణులు' డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి సహధర్మచారిణి, డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలైన డాక్టర్ శాంతిరెడ్డి డిసెంబరు 28న శ్రీసిటీని సందర్శించారు. ఇతర వ్యాపారవేత్తలతో కలసి ఆమె శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డిని కలిసి శ్రీసిటీని పరిశీలించారు. వెనుకబడిన ప్రాంతాన్ని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌గా మార్చడమంటే చిన్నవిషయం కాదని, ఈ విషయంలో శ్రీసిటీ కృషి ప్రశంసాత్మకమన్నారు. అందుకు కారణమైన శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో వైద్యవసతులు మరింత మెరుగుపరిచేందుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన డాక్టర్ శాంతిరెడ్డిని కోరారు. అనంతరం ఆమె శ్రీసిటీ పరిసరాలతో పాటు, ఎంఎస్ఆర్ గార్మెంట్స్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా సందర్శించారు.

# అధ్యాపకుల మార్గదర్శనమే.. జీవితానికి దిక్సూచి

## ఎస్వీయులో.. 'నాటా' అధ్యక్షులు డా. కొర్శపాటి శ్రీధర్‌రెడ్డి



తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విద్యార్థిగా ఉన్నత స్థాయిలో చదువుకుని, ఇప్పుడు అమెరికాలో 'నాటా' (నార్త్ అమెరికా తెలుగు సమితి) అధ్యక్షునిగా సేవలందిస్తున్న డాక్టర్ కొర్శపాటి శ్రీధర్‌రెడ్డి డిసెంబరు 24న తాను చదువుకున్న యూనివర్శిటీకి వెళ్ళి అక్కడి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులతో సమావేశమై కొద్దిసేపు ముచ్చటించారు. అధ్యాపకులే విద్యార్థుల జీవితాలకు దిక్సూచీలని, వారి మార్గదర్శనంతోనే తానింతవాణ్ణి అయ్యానని శ్రీధర్‌రెడ్డి తన కృతజ్ఞతలు వెల్లడించారు. 1984లో ఎంఎస్సీ, 1990లో రసాయన విభాగంలో పిహెచ్‌డి పూర్తిచేసిన డాక్టర్ శ్రీధర్‌రెడ్డి 'నాటా' అధ్యక్షునిగా ప్రపంచ ప్రఖ్యాతిచెందడం ఎస్వీయు రసాయనికశాస్త్ర విభాగానికే గర్వకారణమని అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి ప్రొ.వి.పద్మావతి, ప్రొ.ఎన్‌వై శ్రీధర్, ప్రొ. ఎన్ వెంకటసుబ్బానాయుడు, ప్రొ.సి సురేష్‌రెడ్డి, ప్రొ.వైవి రామిరెడ్డి, ప్రొ.మాధవి, డా.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో.. మళ్ళీ జోరుగా మో(మాం)సపు వ్యాపారం...

# 700 కిలోల కుళ్లిన చికెన్

- పురుగులుపట్టిన మాంసం
- పట్టుకున్న అధికారులు
- ఫ్రీజర్ తెరవగానే వాంతులు



**నెల్లూరు నగరం కుళ్ళిన చికెన్, పురుగులుపట్టిన మాంసం వ్యాపారానికి ప్రసిద్ధి చెందుతోంది. ఎన్నిసార్లు కార్పొరేషన్ అధికారులు హెచ్చరిస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా అక్రమ వ్యాపారుల్లో ఏమాత్రం మార్పు ఉండడం లేదు. పెద్ద మొత్తాలలో జరిమానాలు వేస్తున్నా.. వారికి లెక్కే ఉండడం లేదు. దీని నియంత్రణకు కఠినదండనే పరిష్కారం.. అంటున్నారు ప్రజలు.**

నెల్లూరులోని హరనాథపురంలో ఇటీవల కార్పొరేషన్ అధికారులు ఓ చికెన్‌షాపులో దాడిచేసి, అక్కడ 700 కేజీల కుళ్ళిన మాంసాన్ని పట్టుకున్నారు. కార్పొరేషన్ ఆరోగ్యాధికారి వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. 5 కేజీలు, 10 కేజీలు ఇలా ప్యాకెట్లలో మురగబెట్టివున్న మాంసాన్ని వారు బయటపెట్టి ఫినాయిల్ పోసి దాన్నంతా డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. కోడి గుండెకాయలు, కందనకాయలు, లెగ్‌పీస్‌లు అన్నీ మురిగిపోయి పురుగులుపట్టి గబ్బుకొడుతున్నాయి. పాతికవేలు జరిమానా విధించినా, ఆ దుకాణం నిర్వాహకుడు చలించకపోగా, ఇదంతా మామూలే అన్నట్లుగా చెన్నై నుంచి సోదరుడి సాయంతో నెల్లూరుకు ఈ మాంసాన్ని దిగుమతి చేసుకుంటుంటామని చెప్పడం వారి నిర్భీతికి నిదర్శనం. ప్రజల ఆరోగ్యం ఎటుపోయినా, ఆ మురుగుడు మాంసాన్ని అప్పటికప్పుడు కడిగేసి అమ్మేసి అక్రమంగా లక్షలార్జిస్తున్నారు అనేకమంది వ్యాపారులు. ఈ అక్రమ వ్యాపారంపై ప్రభుత్వం ఇకనైనా కొరడా ఝుళిపించి, తమ ఆరోగ్యం కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



లాయర్
డిసెంబర్ 30, 2022

# 2023.. పెను సవాళ్లు విసిరేనా?

రానున్న కొత్త ఏడాది-2023.. ప్రపంచానికి మునుపెన్నడూ లేనంతగా పెనుసవాళ్లను విసురుతుందా?.. ఎప్పుడూ చవి చూడని విపత్తుల విలయం సృష్టిస్తుందా?..అంటే, 'ఔనన' అంటున్నారు ప్రపంచవ్యాప్తంగా నిపుణులు. సాధారణంగా 'న్యూ ఇయర్' వస్తున్నదంటే.. ప్రపంచమంతా సంబరాలు చేసుకోవడం, సంతోష సంరంభాలతో శుభాకాంక్షలు చెప్పుకోవడం..అదంతా ఒకప్పటి కథ. అది.. గతం. ఇప్పుడారోజులు పోయాయి. కొత్త సంవత్సరం వస్తోందంటే చాలు..అందరూ భయపడే దుస్థితి వచ్చేసింది. అందుకు ప్రధాన కారణం.. కరోనా మహమ్మారే. 2023లో కూడా అది మళ్ళీ మరింతగా విజృంభించి ప్రజల ప్రాణాలు తీస్తుందనే భయం అందరిలోనూ కనిపిస్తోంది. కరోనా దెబ్బతో అత్యధికదేశాల్లో ఇప్పటికే కుప్పకూలిపోయిన ఆర్థిక వ్యవస్థలు.. కొత్తఏడాదిలో కూడా కోలుకునేలా కనిపించడం లేదు. రష్యా - ఉక్రెయిన్ యుద్ధంతో పరిస్థితి విషమంగా తయారైంది. దీంతో ఈ ఏడాదిన అనేక దేశాల్లో ఆర్థికమాంద్యం ఏర్పడనుందనే భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే చైనాలో కరోనా పరమ భీకరంగా విలయతాండవం చేస్తోందని, రోజూ కోవిడ్ కేసులు లక్షల సంఖ్యలో వస్తున్నాయని, ఈ కొత్తసంవత్సరంలోనూ మరింతగా చైనాను వణికిస్తూ లక్షలాది మంది ప్రాణాలను సైతం హరించే భయంకరమైన స్థితి వస్తుందనే అంచనాలు, కథనాలు వినిపిస్తున్నాయి. ఇంతటి భయోత్పాతం ఒక్క చైనానే కాదు, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌ల్యాండ్ తదితర అనేకదేశాలను గడగడలాడిస్తోంది. కరోనా మహమ్మారి వ్యాధి ప్రారంభమైనప్పటి నుంచి అక్కడక్కడా కొన్ని దేశాల్లో తగ్గినట్లనిపించినా, మళ్ళీ బిఎఫ్-17 అనే కొత్త వేరియంట్ రూపంతో ఆ మాయలమారి వ్యాధి నేటికీ ప్రపంచాన్ని భయపెడుతూ ఉంది. ఇప్పటికే ప్రపంచ దేశాల్లో కరోనా కేసులు పెరుగుతూ ఆ సంఖ్య 66 కోట్లకుపైగానే దాటిపోవడం, మరణాల సంఖ్య 66 లక్షలు దాటేయడం ప్రపంచప్రజలను కలచివేస్తోంది. కంటికి కనిపించని ఓ సూక్ష్మ క్రిమి ఇంతగా మృత్యుఘంటికలు మోగిస్తూ ప్రపంచమంతా వ్యాపించి మానవాళిని పొట్టనబెట్టుకుంటుండడం ఈ శకంలోనే కాదు..ఈ యుగంలోనే ఇదొక పెద్ద విపత్తుగా చెప్పవచ్చు. ప్రపంచాన్నే శాసించాలని ఉవ్విళ్లూరుతున్న చైనా వంటి కరడుగట్టిన నియంత దేశమే ఈ వైరస్ ధాటికి విలవిలలాడుతోందంటే కరోనా విజృంభణ ఎంత భయంకరంగా ఉందో ఊహించుకోవచ్చు. 2022-డిసెంబర్‌లో కేవలం 20 రోజుల్లోనే 248 మిలియన్ల మందికి చైనాలో కరోనావ్యాధి సోకడం, ఒక్కరోజులోనే అత్యంత అధికంగా 3.7 కోట్ల మందికి ఈ వ్యాధి రావడం, మరణాలు కూడా విపరీతంగా పెరగడం.. పెద్దసంచలనం సృష్టిస్తోంది. ఇదిలా వుంటే, మానవ తప్పిదాలతో పొంచివున్న విపత్తులు కూడా ఈ ఏడాది మరింతగా విజృంభించే అవకాశం లేకపోలేదంటున్నారు నిపుణులు. మరోవైపు డిసెంబరు చివరివారంలో అమెరికాలో మంచు తుఫాన్ విరుచుకుపడి ప్రధాన నగరమైన న్యూయార్క్‌లో ఎనిమిదడుగులకు పైగానే మంచు మేటలు వేసింది. దీంతో అమెరికాలోని దాదాపు 48 నగరాల్లో జనజీవనం స్తంభించిపోవడమే కాక, వాతావరణం మైనస్ డిగ్రీలకు చేరిపోయి ప్రజలను అష్టకష్టాల పాలుచేస్తోంది. 66మందికిపైగా మృతి చెందారు కూడా. మూలిగే నక్కమీద తాటికాయలు పడ్డట్లుగా, అసలే బాధల్లో ఉన్న ప్రపంచప్రజలకు ఈ కొత్తఏడాది 'ఆర్థిక మాంద్యం' పెనుముప్పుగా పరిణమిస్తుందంటున్నారు నిపుణులు. అయితే, మనదేశానికి ఈ ముప్పు పెద్దగా లేకపోయినా, కరోనా మహమ్మారిని మాత్రం మళ్లీ జయించక తప్పదు. మనదేశంలో ఇప్పటికే దాదాపు నాలుగున్నర కోట్లమందికి పైగానే కరోనా వాతపడి బాధలు పడ్డారు. 5 లక్షల మందికి పైగానే బలైపోయారు కూడా. కరోనా కోరల నుంచి ఎలాగో బయటపడి, ఆర్థికంగా కూడా తిరిగి నిలబడి బలపడుతున్న భారత్‌కు, వ్యాక్సినేషన్‌లతో కోవిడ్‌ను ఎదుర్కోగలిగే ధైర్యం ఉన్నా, మాయలమారి కరోనాను మాత్రం ఏమాత్రం నమ్మడానికి వీల్లేదు. దాని అంతుచూసే దాకా ప్రతిఒక్కరూ కృషి చేయడం, అందరూ మాస్కులు ధరిస్తూ, కోవిడ్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ఒక్కటే మార్గం. ఏదేమైనా, రానున్న కొత్త ఏడాదిన.. ఈ ముప్పులు ఇంకెంత భయంకరంగా ఉంటాయోననే సందేహాలు అందరినీ బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మానవాళి ప్రాణాలు తీస్తున్న కరోనాపై అన్ని దేశాలు కలిసి యుద్ధప్రాతిపదికపై పోరు సాగించడం తక్షణ కర్తవ్యం కావాలి. అందరం కలిసికట్టుగా కరోనాని తరిమికొట్టి.. 'కరోనా రహిత ప్రపంచాన్ని' సాకారం చేసుకోవాలి.

# పొగమంచుతో.. ప్రమాదాలు



అసలే మన రోడ్లు అంతంతమాత్రం. ఎక్కడ గుంటలుంటాయో, ఎక్కడ మలుపులు తిరుగుతాయో ఊహించలేం. మనకు స్పీడ్‌బ్రేకర్లు లేవు కానీ, ఆ లోటును పూడుస్తూ గజానికో గుంట మాత్రం ఉంటుంది. రోడ్ల మీదున్న గుంటలు సరిచేయడం, అవసరమైన చోట్ల కనీసం ప్యాచ్‌వర్క్‌లన్నా చేయడం వంటి పనులకు కూడా ఎంతోకాలంగా మనవాళ్ళు నీళ్లొదిలేశారు. వానలతో రోడ్లు గుల్లబారినా వాటి ముఖం చూసే నాథులే ఉండడం లేదు. చేసిన పనులకు బిల్లులు రావనే వాళ్ళు కొందరు, ఇప్పుడు బాగుచేసినా వానొస్తే మళ్ళీ గుంటలే కదా అనేవాళ్లు కొందరు. ఇదీ దుస్థితి!. దీంతో ఒక్క నెల్లూరు నగరంలోనే కాదు, జిల్లావ్యాప్తంగా రోడ్లు మరీ దరిద్రంగా తయారయ్యాయి. దెబ్బతిన్న రోడ్ల మీద, కోతకు గురైన రోడ్లపైనా ప్రయాణించడం ఎంత నరకయాతనో చెప్పలేం. ఇక రోడ్లు ఈ మంచుకాలంలో సరిగా కనిపించకుంటే ఎంత కష్టమో చూడండి!.. దీంతో ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణాలు మరింత ప్రమాదకరంగా ఉంటున్నాయి. పట్టపగలే అతివేగంతో ప్రమాదాలు జరిగిపోతుంటే, ఇక రాత్రివేళల్లో పరిస్థితి ఎంత స్పీడ్‌గా ఉంటుందో ఊహించండి. ట్రాఫిక్ నియమాలకేం..బోలెడన్ని ఉంటాయి. కానీ, పగలే వాటికి దిక్కుండదు. ఇక రాత్రి సమయాల్లో వాటిని పట్టించుకునే వారెవరు?..అంతా ఎవరిష్టం వారిదైపోయింది. దేనికీ అడ్డూ ఆపూ ఉండడం లేదు. జాతీయ రహదారులపైనే కాదు, మామూలురోడ్లపై కూడా నెమ్మదిగా వెళ్ళడమనేది

## సమస్యల తో 'రణం'

ఉండదు. మితిమీరిన వేగంతో వెళ్ళడం.. పెద్ద ఫ్యాషనైపోయింది చాలామందికి. అయినా, ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే మన వాహనాలే సక్రమంగా నడిస్తే చాలదు..ఎదురొచ్చే వాహనాలు కూడా సక్రమంగానే రావాలి. మనకు అవతలి వాహనం కనిపిస్తేనే సరిపోదు, అవతలి వాళ్లకి మన వాహనం కూడా బాగా కనపడాలి. వీటిలో ఏ చిన్న తేడా వచ్చినా ప్రమాదం జరిగిపోయినట్లే. కన్నుమూసి తెరిచే లోగా వాహనాలు ప్రమాదాలకు గురవుతుంటాయి. నిజానికి.. రోడ్ల ప్రమాదాలకి ఎన్నో కారణాలుంటాయి. ముఖ్యంగా వానల్లో, దట్టమైన మంచు వాతావరణంలో ప్రయాణాలు ప్రమాదకరమని తెలిసినా, మనవాళ్లు మాత్రం రోడ్డెక్కితే చాలు.. 'తగ్గేదే లే' అంటూ ఝామ్మంటూ వాహనాలు నడిపేస్తుంటారు. ప్రమాదం జరిగాక కుయ్యో మొర్రో అంటుంటారు. అందువల్ల ఫలితం ఏముంటుంది?.. పొగమంచు కారణంగా జిల్లాలో గతంలో ప్రమాదాలెన్నో జరిగిపోయాయి. ఇకనైనా వాటిని గుణపాఠంగా తీసుకొని జాగ్రత్తలు పాటించాలి.

### రోడ్ల మలుపుల్లో అప్రమత్తంగా ఉండాలి

పొగమంచు రానురాను దట్టంగా వ్యాపిస్తోంది కూడా. సంక్రాంతి చలిరోజులు పోయేదాకా జాగ్రత్తగా ఉండాలి. చీకటి పడ్డప్పటినుంచి, తెల్లవారి ఏడెనిమిది గంటల దాకా ఈ మంచుదెబ్బకి అసలు రోడ్డే సరిగా కనిపించడం లేదు. లైట్లు వేసుకుని ప్రయాణం చేసినా ఎక్కడ గుంటలుంటాయో తెలియడం లేదు. రోడ్ల మలుపుల్లో ప్రమాదం పొంచివుంటుంది. కొండలు కోనల్లో ప్రయాణించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి. పిల్లాపాపల్ని వాహనాల్లో తీసుకువెళ్తున్నప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. రెప్పపాటులో ప్రమాదం జరిగిపోతుంది.. మరీ అత్యవసరమైతే తప్ప రాత్రివేళల్లో, ఈ మంచుకాలంలో ప్రయాణించకపోవడమే ఉత్తమం అనిపిస్తోంది. అన్నీ ఎవరో చూడాలి..ఎవరో చేయాలి అని ఆశించకుండా, వాహనదారులు ఎవరిపాటికి వారు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వాహనాలు నడపడమే ముఖ్యం. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలి. మద్యానికి దూరంగా ఉండాలి. చలికి అందరూ ముడుక్కుని ఉంటారులే.. ఈ రాత్రిపూట ఎవరొచ్చి చూస్తారులే..అని పూటుగా మద్యం తాగేసి వాహనం నడిపేస్తే.. ఆ మత్తులో అదెక్కడికి వెళ్తుందో దానికే తెలియదు. ముఖ్యంగా జాతీయ రహదారుల మధ్యలో డివైడర్లు ఉంటాయి గనుక ఏ మాత్రం తూలినా, కునుకుపాట్లు పడినా ప్రమాదాలు తప్పవు. సాధారణ రోడ్లలో కూడా మధ్యమధ్యలో అనేక అవాంతరాలు ఉంటాయి. రాత్రి వేళల్లో మెలకువగా వాహనాలు నడపకుంటే.. ప్రాణాలకు గ్యారంటీ ఉండదు. మన వాహనం..మన ప్రాణం..మనకు ముఖ్యం. దాంతోపాటు ఎదుటివారి ప్రాణాలకీ ఇబ్బంది లేకుండా ప్రయాణం సాగించాలి. పోలీసులు, అధికారులు కూడా అన్నీ ఆలోచించి రాత్రివేళల్లో వాహనాలవారు అప్రమత్తంగా ఉండాలంటూ అవగాహన కల్పిస్తుండాలి. తరచూ స్పీడ్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తుండాలి. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలి. దొంగచాటు రవాణాలన్నీ చాలా వరకు రాత్రివేళల్లోనే జరుగుతుంటాయి. రాత్రిపూట, వేకువ జాములో కూడా అత్యంత వేగంగా వెళ్ళే ఆ వాహనాలమీద మరింత నిఘా పెట్టి ఉండాలి. రోడ్లపై తరచూ తనిఖీలతో అలాంటి అక్రమవాహనాలను అరికట్టాలి. ఈ మంచుకాలంలో రాత్రివేళ కూడా ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకోసం, రోడ్ల పొడుగూతా జాగ్రత్తలు తెలిపే బోర్డులు ఏర్పాటుచేయడం, రోడ్ల మీద మితిమీరిన వేగాన్ని నియంత్రించడం వంటివన్నీ ఎంతో అవసరం.

- సంచారి

# ముందుజాగ్రత్తలే..ముఖ్యం

ఇక కరోనా రాదులే.. వచ్చినా మనకేం పెద్ద ప్రమాదం లేదులే అనుకుంటున్న తరుణంలో, కరోనా మళ్ళీ కోరలు చాస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా జనాన్ని వణికించి చంపుతోంది. రకరకాల మాయలమారి వేషాలతో, కొత్త కొత్త వేరియంట్‌లతో కరోనా మళ్ళీ మనదేశంలో కూడా విజృంభిస్తుందేమో నన్న ఆందోళన సర్వత్రా కలుగుతోంది. చైనా వంటి దేశాల్లో కరోనా వీరంగం చేస్తోంది. ఒక్కరోజులోనే కోట్లాది కేసులు వస్తున్నాయంటే, కంటికి కనిపించని కరోనా సూక్ష్మక్రిమి ఎంతవేగంగా దూసుకొస్తున్నదో అర్థమవుతోంది. ఒక్కరికొస్తే చాలు వెంటనే వందలు, వేలాదిమందికి అది అంటుకుంటోంది. ఈ పీడ ఇంకా వదల్లేదు కాబట్టి ప్రజలు ప్రతిఒక్కరూ ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన తరుణమిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రాకాసిని నిరోధించాలని ఇప్పటిదాకా చేసిన ప్రయత్నాలు, వచ్చిన వ్యాక్సిన్‌లు ఫలించి, మనల్నింతకాలం బతికించాయి. సమయానికి వ్యాక్సిన్ రాబట్టి ఎంతో మేలు కలిగింది. ఇప్పుడు మళ్ళీ కరోనా వస్తుందేమోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. ప్రజలు కరోనా కోరల్లో పడకుండా ప్రభుత్వాలు అన్నివిధాలా ఆలోచించి సూచనలు చేస్తున్నాయి. అందరూ తప్పనిసరిగా ఆ నియమాలు పాటించాలి. వాటిని పాటించకుంటే మనకే ప్రమాదం. ఆ మహమ్మారిని దూరంగా ఉంచాలంటే మునుపటిలా ప్రతిఒక్కరూ మాస్కులు వేసుకోవడం, తరచూ శానిటైజర్లు-లేదా సబ్బులతో చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండడం, బజార్లలో గుంపులుగా తిరక్కుండా ఎవరికి వారు దూరం పాటించడం వంటి ముందు జాగ్రత్తలు తప్పనిసరి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మళ్ళీ కరోనా ముప్పు తప్పదు. వ్యాక్సిన్ వేసుకున్నాం కదా మనకేం కాదులే అనుకోకండి. ఎందుకైనా మంచిది ముందు మాస్కులు పెట్టుకోండి. జలుబు, దగ్గు ఎక్కువగా ఉంటే ఒకసారి కరోనా టెస్టు కూడా చేయించుకోండి. ఏదేమైనా ఈ కరోనాతో తస్మాత్!..జాగ్రత్త సుమా!..

ఎల్.సింహాద్రి, కావలి.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## పాఠ్యపుస్తకాలు ఇంకా ఎప్పుడిస్తారు?

విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడిచిపోతున్నా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అటు ప్రైవేటు పాఠశాలల్లో గాని, ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో గాని పుస్తకాలు ఇంకా రాలేదు. పాఠ్యపుస్తకాలు రాకుంటే ఎలా చదవాలి, ఏం చదవాలి అని పిల్లలు బిక్క ముఖం పెడుతున్నారు. గతంలో ప్రభుత్వ బడులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేది. ప్రైవేట్ స్కూళ్ళవాళ్ళు పుస్తకాల షాపుల్లో కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ప్రభుత్వమే అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపాలి. రేపో మాపో పుస్తకాలు వస్తాయని అందరూ ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ రోజులు గడిచిపోయి విద్యా సంవత్సరం పూర్తయ్యే దశకు వస్తున్నా ప్రభుత్వం పుస్తకాల పంపిణీ ప్రక్రియపై దృష్టిపెట్టకపోవడం విచారకరం. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లోనే చూసి పిల్లలకు పాఠాలు చెప్తున్నారు. ఎంత కాలం ఇలా? ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- జె.భవ్య, నెల్లూరు.

## 'శ్రీవాణి' వేదిక ఆధ్వర్యంలో..

# భగవద్గీత పారాయణం



శ్రీసిటీలోని 'శ్రీవాణి' ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ద్వారా ఇటీవల శ్రీసిటీలోని ఆరూరు నర్సరీ ప్రాంగణంలో ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కీర్తి, భారతి, సుకన్య, సుజాత ఆధ్వర్యంలో మల్లవారిపాలెం వెస్టు, ఇతర సమీప గ్రామాలకు చెందిన సుమారు 70 మంది ఇందులో పాల్గొని భక్తిశ్రద్ధలతో భగవద్గీత శ్లోక పఠనం చేశారు. సనాతన ధర్మంలో భగవద్గీత అత్యంత విలువైన పవిత్ర గ్రంథమని, భగవద్గీత శ్లోక పారాయణం ప్రజల మనస్సులపై అనుకూల ప్రభావాలను చూపడంతో పాటు, జీవితంలో సరైన మార్గాన్ని ఎంచుకోవడంలో మార్గనిర్దేశం చేస్తుందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పవిత్ర ధనుర్మాసంలో శ్రీసిటీ పరిసర గ్రామాల మహిళలు, చిన్నారులు చురుగ్గా పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పచ్చదనంతో నిండి, ప్రశాంత వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు, శ్రీసిటీ ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని, శ్రీవారి ప్రసాదంగా తిరుమల లడ్డు మరియు అన్నప్రసాదాలను స్వీకరించారు.

# పెద్దాసుపత్రిలో.. 50 పడకలతో కరోనా వార్డు

ప్రపంచాన్ని కరోనా వైరస్ వణికిస్తూనే ఉంది. మనదేశంలోని గుజరాత్, ఒడిశాలో కొత్తగా కరోనా కొత్త వేరియంట్ బిఎఫ్-7 జాడలు కనిపించడంతో వెంటనే కేంద్రప్రభుత్వం అన్నిరాష్ట్రాలకు, జిల్లాలకు ముందుజాగ్రత్తలు చెప్తోంది. ఇందులో భాగంగా నెల్లూరు పెద్దాసుపత్రిలో పల్మనాలజీ బ్లాక్‌లో కరోనా ప్రత్యేకవార్డును ఏర్పాటుచేశారు. అక్కడ 50 పడకలతో వార్డును సిద్ధం చేసినట్లు ఈనెల 24న పెద్దాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా తెలిపారు. కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదని, కేసులు వచ్చినా ఈసారి కరోనా పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని, ప్రజలు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. అయితే, ప్రతి ఒక్కరూ ముందుజాగ్రత్తగా గతంలో వలెనే మాస్కులు ధరించడం, చేతులు తరచూ శుభ్రపరచుకోవడం, గుంపులుగా తిరగకుండా భౌతికదూరం పాటిస్తుండడం మరచిపోవద్దని ఆయన చెప్పారు. గత అనుభవాలను చూశాక, ఒకవేళ కరోనా కేసులు వచ్చినా, కరోనాను ఎదుర్కొనేందుకు మందులు, ఆక్సిజన్‌ప్లాంట్‌లు అన్నీ సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

# 'తంగిరాల మహాభారతం' 36వ భాగం




కౌరవ, పాండు కుమారుల అస్త్ర విద్యాభ్యాసం పూర్తైన తర్వాత ద్రోణాచార్యుడు శిష్యులు విద్య ప్రదర్శన చెయ్యాలని కోరినప్పుడు, కౌరవ ప్రముఖులు ఒప్పుకుని, ఒక విశాలమైన ప్రదేశంలో రంగస్థలం నిర్మిస్తారు. కౌరవ పెద్దలు, గాంధారి, కుంతీ వచ్చి కూర్చుంటారు. ప్రేక్షకులతో ఆ ప్రదేశమంతా కోలాహలంగా ఉంటుంది.

ద్రోణాచార్యుడు శిష్యులని తీసుకుని వచ్చి మొదటగా భీమ, దుర్యోధన గదా యుద్ధం ఆదేశిస్తాడు. ఇద్దరు తమ తమ గదా కౌశలం చూపెడతారు. వాళ్లిద్దరు మహాకోపంతో ఒకరిమీదొకరు ఉరికి భయంకర నినాదాలతో పోరాడుతుంటే, ప్రేక్షకులు కోపాలతో, కలహాలతో చీలిపోతారు. విదురుడు ధృతరాష్ట్రుడికి ఆ పోరాటం గురించి వివరిస్తాడు. కానీ, వారిద్దరి మధ్య పోరాటం తీవ్రమవుతుంది. అది గమనించి ద్రోణాచార్యుడు అశ్వత్థామని పంపి ఆ పోరాటాన్ని ఆపివేయవలసిందిగా ఆజ్ఞాపించాడు.

తర్వాత ద్రోణాచార్యుడు తన ప్రియ శిష్యుడు అర్జునిని పిలుస్తాడు. అర్జునుడు వివిధ అస్త్ర ప్రయోగాలతో సభాసదులని కనువిందు చేస్తాడు. ప్రేక్షకులు ఎంతో ఆనందించి అర్జునుణ్ణి పొగడ్తలతో ముంచేస్తారు. కుంతి ఎంతో గర్వపడుతుంది. ధృతరాష్ట్రుడు కూడా అది విని, తమ్ముడైన పాండురాజు కుమారుడు ఎంతో ప్రావీణ్యుడయ్యాడని సంతోషిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.




## స్మృత్యంజలి



## డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై 17 ఏళ్ళు గడిచాయి.

**మరపురాని మీ మధుర జ్ఞాపకాలతో...**

భార్య :
**డాక్టర్ చిట్టమూరు భారతి**

| | |
|---|---|
| కుమారుడు : **చిట్టమూరు లోహిత్** | కుమార్తె : **ప్రణీత అరవింద్** |
| చెల్లెలు : **నిర్మల** | అల్లుడు : **అరవింద్ దినకర్** |
| బావ : **డా॥ సి.యం.కె.రెడ్డి** | మనుమరాళ్ళు **ఆద్వి అరవింద్, స్మియ అరవింద్** |

మరియు కుటుంబసభ్యులు



## అంబరాన్నంటే సంబరం.. 'నాటా ఆట పాట'ల ఆనందాల సంరంభం!...

# ప్రేమసాగరునికి 'పౌరసన్మానం'.. నెల్లూరుసీమకే గర్వకారణం!

## 'విశ్వవైద్య విభూషణ్' బిరుదుతో 'ప్రేమన్న'కు ఆత్మీయ సత్కారం.. చరిత్రాత్మకం!















**నెల్లూరుసీమ ధన్యమైంది!. ప్రపంచవ్యాప్త ఖ్యాతిగాంచిన మన నెల్లూరుసీమ గారాలబిడ్డ.. భరతమాత ముద్దుబిడ్డ.. అమెరికాలో పేరెన్నికగన్న మన నెల్లూరీయుడు.. డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డికి.. నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో డిసెంబర్ 26న పౌరసన్మానం వేడుక..ఆద్యంతం అత్యద్భుతంగా..అంబరాన్నంటే సంబరంగా జరిగింది. దాదాపు 13 సంవత్సరాల తర్వాత అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ ప్రేమ్‌రెడ్డిని చూడడంతో నెల్లూరీయుల మనసు ఆత్మీయతతో పరవశించింది. అభిమానంతో ఉరకలెత్తింది. 'నాటా' వాళ్ల ఆధ్వర్యంలో, ప్రజలంతా ఆయన్ను ఘనంగా ఆహ్వానించి చేసిన పౌరసన్మానంతో పాటు, ఎంతో విశిష్టమైన 'విశ్వవైద్య విభూషణ్' బిరుదు ప్రదానంతో.. నెల్లూరు నేలతల్లి పులకించిపోయింది. జిల్లా చరిత్రాలోనే ఇదొక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయింది.**

నెల్లూరుసీమలో నిడిగుంటపాళెం అనే మారుమూల కుగ్రామంలో పుట్టి, అగ్రరాజ్యమైన అమెరికాలో అనేక ఆసుపత్రులు పెట్టి... అపూర్వమైన వైద్య సేవలతో ప్రపంచప్రఖ్యాతి గడించిన మన భారతీయవైద్యుడు.. డాక్టర్ ననమాల ప్రేమసాగర్‌రెడ్డికి 'నాటా' (నార్త్ అమెరికా తెలుగుసమితి) వారి ఆధ్వర్యంలో, నెల్లూరీయులంతా కలసి ఆత్మీయంగా చేసిన ఘనమైన సన్మానం చరిత్రాత్మకంగా నిలిచింది. అంతర్జాతీయస్థాయిలో అగ్రశ్రేణి హృద్రోగ వైద్యనిపుణునిగా ఉంటూ తనదంటూ ప్రత్యేకమైన సేవాభావంతో రాణిస్తున్న.. డాక్టర్ ప్రేమ సాగర్‌రెడ్డి అసామాన్యమైన ప్రతిభాపాటవాలను కొనియాడుతూ, ప్రపంచ వైద్యసేవారంగంలోనే ఎంతో అరుదైన ఆ మహోన్నత వైద్యునికి.. విశిష్టమైన 'విశ్వవైద్య విభూషణ్' అనే బిరుదును కూడా అందజేసి సత్కరించడం విశేషం!..'నాటా' వారికే కాదు, ఇందులో వాటా పంచుకున్న సింహపురి సీమకే ఇది గౌరవం. నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో డిసెంబరు 26న జరిగిన ఈ నాటా ఆట-పాటల సందడితో.. సన్మాన వేడుక అద్వితీయంగా ఉండి అందరినీ ఆకట్టుకుంది.

### ప్రముఖుల రాకతో సందడే సందడి

డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డికి పౌరసన్మానం సందర్భంగా పెద్దసంఖ్యలో రాజకీయ నాయకులు, ప్రముఖులు తరలిరావడంతో సందడి నెలకొంది. రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణులు' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, నెల్లూరు జడ్పీఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీలు టి.మాధవరావు, వాకాటి నారాయణరెడ్డితో పాటు ఈ కార్యక్రమానికి సారథ్యం వహించిన 'నాటా' అధ్యక్షులు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కేశవరామిరెడ్డి, శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితర ఆహ్వాన కమిటి సభ్యులు, ఈ కార్యక్రమం నిర్వహణలో కీలక భూమిక పోషించిన 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులంతా కలసి డాక్టర్ ప్రేమసాగర్ రెడ్డికి, ఆయన సహధర్మచారిణి శ్రీమతి శాంతికి అపూర్వమైన రీతిలో స్వాగత సత్కార కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

### భారీ గజమాలతో స్వాగతం

ఈ కార్యక్రమానికి వేదికగా మారిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద నిర్వాహకులు ఒక పెద్ద క్రేన్‌ను ఏర్పాటుచేసి, భారీ గజమాలను డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి దంపతుల మెడలో వేసి స్వాగతం పలికారు. కోలాటాలు, తీన్‌మార్ బ్యాండ్ మేళాలు, మంగళవాద్యాలు, డప్పు వాద్యాలు, కేరళ మేళాలు, ప్రజలు పెద్దఎత్తున చేసిన హర్షధ్వానాల నడుమ వందలాది మంది అభిమానులు పూలవర్షం కురిపిస్తుండగా... పులకాంకితులైన డాక్టర్ ప్రేమ్‌రెడ్డి- శాంతి దంపతులు ఎంతో వినయంగా.. ఒద్దికగా ముకుళితహస్తాలతో.. వేదిక వద్దకు చేరుకోవడంతో సభికులంతా ఒక్కసారిగా లేచినిలబడి వారికి గౌరవ పూర్వకంగా స్వాగతం చెప్పడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమసాగర్ రెడ్డి అమెరికాలో నిర్వహిస్తున్న వైద్యసేవలు, ఆయన సారథ్యంలో పుట్టిన ఊరికి ఏళ్ళ తరబడిగా చేస్తున్న సేవా కార్యక్రమాలతో రూపొందించిన లఘు డాక్యుమెంటరీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత, వేదపండితుల ఆశీర్వచనాల మధ్య, సన్మానపత్రంతో పాటు, పౌరసన్మానం, 'విశ్వవైద్య విభూషణ్' బిరుదుతో డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డికి సత్కారం ఘనంగా జరిగాయి. ఈ సన్మానసభకు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అతిథులను వేదికమీదకి ఆహ్వానించి సభను నిర్వహించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా డాక్టర్ బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి వందన సమర్పణ గావించారు.

### 'విద్య'తోనే..అత్యున్నత స్థాయి గౌరవం

**- డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి**

'విద్య' అనేది ప్రతిఒక్కరికీ ఎంతో ముఖ్యమని, చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని, తానింత స్థాయికి వచ్చానంటే చదువే అందుకు ప్రధాన కారణమని, ఆ చదువే లేకపోతే తనకు ఏ గుర్తింపూ ఉండేది కాదని డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి ఈ సన్మానం సందర్భంగా చెప్పారు. విద్య-విజ్ఞానం రెండుకళ్ళుగా అందరూ బాగా చదువుకుని ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. నిడిగుంటపాళెం అనే కుగ్రామంలో..చిన్నప్పుడు తాను ఓ చిన్న గుడ్డిదీపం వెలుగులోనే చదువుకున్నానని, బడికి వెళ్ళాలన్నా దారి సరిగా లేక పొలాల్లో బురదలో నడిచి బడికి వెళ్ళానని, ఆ బురదలో తాను వేసుకున్న స్లిప్పర్స్ ఊడిపోతే..వాటిని ఆ బురదనీళ్ళతోనే కడుక్కుని వేసుకుని



కుటుంబసభ్యులను సభికులకు పరిచయం చేస్తున్న డా. ప్రేమ్‌రెడ్డి

వెళ్ళేవాడినని, అవన్నీ తనకు గుర్తున్నాయని, అలా కష్టపడి చదువుకోవడం వల్లనే తానిప్పుడు ఇంతవాడినయ్యానని..డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి వినమ్రంగా వివరించారు. తనకు నెల్లూరులో ఇంత ఘనమైన సన్మానం జరుగుతుందని ఊహించనే లేదన్నారు. తమతో పాటు ఈసారి తమ కుమార్తెలు, కుటుంబ సభ్యులందరినీ తీసుకురావడం తనకెంతో ఆనందంగా ఉందని, తనకు సన్మానాలంటే పెద్దగా ఇష్టం లేదని, సన్మానాల కోసం తానిక్కడికి రాలేదని, ఒకవేళ తాను భవిష్యత్తులో నిడిగుంటపాళెంకు రాలేకపోయినా, తన బిడ్డలైనా ఇక్కడికి వస్తారనే ఆకాంక్షతో తన పుట్టినవూరికి వీళ్ళందరినీ తీసుకువచ్చానని ఆయన చెప్పడంతో సభికులంతా పెద్దఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. జన్మభూమిపై ఆయనకున్న మమకారానికి పులకించిపోయారు.

అనంతరం తనకు చిన్నతనంలో పాఠాలు చెప్పిన నిడిగుంటపాళెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గోపాలయ్య దంపతులకు డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి దంపతులు శాలువతో ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డిని అనేకమంది ప్రముఖులు సన్మానించారు. ఆయన సతీమణి డాక్టర్ శాంతిని..శ్రీమతి మమత సన్నారెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు ప్రభు (తుంగా శివప్రభాత్‌రెడ్డి) సతీమణి, శ్రీమతి తుంగా భారతి కలసి ఆత్మీయంగా సత్కరించారు.



తమ గురువులను సత్కరిస్తున్న డా. ప్రేమ్‌రెడ్డి దంపతులు







### ప్రపంచానికే గర్వకారణం

**- రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి చేస్తున్నసేవలు ఒక్క వైద్యరంగానికే కాదు ప్రపంచానికే గర్వకారణం. నెల్లూరుజిల్లాలో ఒక చిన్న గ్రామంలో పుట్టి, ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా ఉన్న అమెరికాలో తనదైన సేవలతో ప్రపంచఖ్యాతిని పొందుతున్న మన నెల్లూరీయుడు డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి సేవలు ప్రతిఒక్కరికీ ఆదర్శం. అమెరికాలో దాదాపు 45 వైద్యసంస్థలు నెలకొల్పడమంటే చిన్న విషయమేమీ కాదు. ఆయనకు ఈరోజు జిల్లావాసులందరి తరఫునా నెల్లూరులో సన్మానం చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయం.



### ఏం అడిగినా.. లేదు-కాదనేది లేదు

**- మంత్రి కాకాణి**

డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి దాతృత్వానికి ఎల్లలు లేవు. ఎవరే సాయం అడిగినా లేదు-కాదనేది ఉండదు. దానగుణం అనేది రక్తంలో ఉండాలంటారు పెద్దలు. అంతటి దాతృత్వం ఆయన సొంతం. అమెరికాలో కోట్లాది రూపాయలతో ఆయన రోగులకు చేస్తున్న సేవలకు అంతే లేదు. అంతే కాదు, పుట్టిన ఊరైన నిడిగుంటపాళెం అభివృద్ధికి కూడా ఆయన చేస్తున్న సేవలు నిరుపమానం. డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డికి తన పుట్టినగడ్డ మీద పౌరసన్మానం చేయడం, 'విశ్వవైద్య విభూషణ్'గా ఆయనకు బిరుదును ప్రదానం చేయడం సముచితం.



### ఒదిగుండే మహామనీషి

**- మంత్రి కారుమూరు నాగేశ్వరరావు**

డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి అమెరికాలో ఎంత గొప్పవైద్యునిగా ఉన్నా, ప్రపంచవ్యాప్తంగా ఆయన ప్రఖ్యాతిగన్నా, ఎంతగా ఎదిగినా ఎంతో ఒదిగి ఉండే తత్వం ఆయన సహజ గుణం. ఆయన సేవలు, ప్రతిభాపాటవాలు స్ఫూర్తిదాయకం. ఇలాంటి మంచివారు సమాజంలో ఎంతో అరుదు.



### 'ఆ కొరత..ఇప్పుడు తీరింది'

**- నాటా' అధ్యక్షుడు డా. కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి**

ప్రపంచవ్యాప్త ఖ్యాతిగన్న సేవామూర్తి డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి పుట్టినగడ్డ అయిన నెల్లూరులో ఇంతకాలంగా పౌరసన్మానం జరగలేదే అనే బాధ మనసులో చాలాకాలాంగా ఉండేది. ఇప్పుడా కొరత తీరింది. డాక్టర్ ప్రేమన్నకు పౌరసన్మానం జరగడం, అది కూడా నాటా సేవాడేస్‌లో భాగంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది.



### డాక్టర్ ప్రేమ్‌రెడ్డికి సత్కారం.. మనందరికీ గౌరవం

**- లాయర్ సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి**


ప్రపంచ వైద్యరంగంలో ఆణిముత్యంగా భాసిస్తూ, ప్రపంచానికే అమూల్యమైన సేవలందిస్తున్న డాక్టర్ ప్రేమ్‌రెడ్డిని సత్కరించుకోవడం ఆయనకే కాదు..మనందరికీ గౌరవం. డాక్టర్ ప్రేమ్‌రెడ్డి అంటే మంచికి మానవతకు దాతృత్వానికి పెట్టింది పేరు. అలాంటి మహోన్నత వ్యక్తిని సన్మానించుకునే భాగ్యం మీ అందరితో పాటూ మాకూ కలగడం మా అదృష్టం. 'నాటా' ప్రతినిధులు డాక్టర్ కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కేశవరామిరెడ్డి తదితరుల సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రోత్సాహకులుగా మా అందరికీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులంతా ఎంతగానో సహకరించారు. వారికి ధన్యవాదాలు. ఈ సందర్భంగా 'వాత్సల్య' అనాధాశ్రమం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలను అమెరికాలో ఉన్న మా సోదరి మాలిని తిలకించి, వారికి సాయం అందించాలని భావించడం సంతోషకరం. మా నాన్న స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి ('లాయర్' పత్రిక వ్యవస్థాపకులు)గారు, అమ్మ శ్రీదేవమ్మల జ్ఞాపకార్థం 'వాత్సల్య' చిన్నారులకు సాయంగా లక్ష రూపాయలు ఆమె తరపున అందజేయమని ఆమె కోరారు. ఈ విశిష్టమైన కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రజలకు, నాయకులకు, డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి అభిమానులకు..అందరికీ మా కృతజ్ఞతలు.



### స్ఫూర్తిదాయక సేవలు

**- శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి**

డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి అమెరికా వెళ్లిపోయిన తర్వాత, మళ్ళీ చాలా కాలానికి మనదేశానికి వస్తున్నారని తెలియగానే నాకెంతో సంతోషం కలిగింది. తన సొంతవూరిని సందర్శించుకోవడానికి వారు ఇక్కడకు రావడం..నిజంగా ఇదొక శుభదినం. ఈ సందర్భంగా ఆయన్ను మనం సన్మానించుకోవడం ఒక అదృష్టం. ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన ఆ మహోన్నత వైద్యవిజ్ఞాన నిధికి నెల్లూరులో పౌరసన్మానం జరగడం ఆనందదాయకం. అనేక వైద్యసంస్థలు స్థాపించి ప్రపంచానికి డాక్టర్ ప్రేమ్‌రెడ్డి అందిస్తున్న నిరుపమాన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం. ఆయనకు 'విశ్వవైద్య విభూషణ్' బిరుదు ఇవ్వడం సముచితం.



### మానవతామూర్తి.. మా ప్రేమన్న

**- 'నాటా' ప్రతినిధి డాక్టర్ కేశవరామిరెడ్డి**

'మా ప్రేమన్న' మానవతామూర్తి. అమెరికా వైద్యరంగానికే ఆయన తలమానికం. ఇంత గొప్ప స్థాయిలో ఉన్నా ఏనాడూ జన్మభూమిని మరచిపోని సహృదయుడు. అంతటి గొప్ప వ్యక్తి మనవాడు కావడం కంటే ఆనందం ఇంకేముంటుందీ?!...

















# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## మైనారిటీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ముస్లిం మైనారిటీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర దిశ అవగాహన కమిటీ కార్యదర్శి ఎన్.అరుణ తెలిపారు. ఈ నెల 25వ తేదీ గూడూరు షాదీ మంజిల్‌లో మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి ముస్లిం బాల బాలికలకు స్టడీమెటీరియల్ పంపిణీ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరుణ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ దిశ యాప్‌ను తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. నెట్‌వర్క్ గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్య లేని కారణంగా ముస్లింలు వెనుకబాటుతనంతో ఉన్నారని, విద్య ఉంటేనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. నెట్‌వర్క్ అధ్యక్షులు మహబూబ్ బాషా, రహీం, కాలేషా, షాన్వాజ్, రవూఫ్, అన్వర్, అహ్మద్, కరిముల్లా పాల్గొన్నారు. తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు వైస్‌చైర్మెన్ సయ్యద్ అబ్దుల్‌గఫూర్‌ని నెట్‌వర్క్ సభ్యులు ఘనంగా సన్మానించారు.



## ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం


ఈ నెల 27వ తేదీ గూడూరు రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో గూడూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బత్తిన విజయకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి యూనియన్‌కి గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారని, ఆర్థిక సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. యూనియన్ అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి ప్రతి కార్మికుడు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కార్మికులను ఘనంగా సన్మానించారు. నారాయణరాజు, దశయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దాతల ఔదార్యం స్ఫూర్తిదాయకం

### - గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు



పేదల అవసరాలను గుర్తించి దాతలు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని గూడూరు రూరల్ సిఐ దశరథరామారావు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ గూడూరు పట్టణ శివారులోని నెల్లటూరు జనార్ధన్‌నగర్ గిరిజన కాలనీలోని సుమారు 25 గిరిజన కుటుంబాలకు బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ దశరథరామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న గిరిజన కుటుంబాలకు తన వంతు సాయంగా ఏదో ఒకటి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం సిఐ వారి జీవన విధానంపై ఆరా తీశారు. బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మస్తాన్, మోహన్, అశోక్ వెంకీ తదితరులు పాల్గొన్నారు.






### ప్రభుత్వ నిర్ణయంతో

## బాధితులకు కష్టాలు



కొన్ని సంవత్సరాలుగా పింఛన్లు తీసుకుంటున్న లబ్దిదారులు ఇప్పటికిప్పుడే అనర్హులుగా మారిపోయారా? ఇదేం న్యాయమని మాజీఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పింఛన్ల తొలగింపుపై బాధితులతో కలసి ఈ నెల 26వ తేదీ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నిరుపేద కుటుంబాలకు చెందినవారే అధికంగా పింఛన్లు తీసుకుంటున్నారని, ప్రభుత్వ నిర్ణయంతో వారంతా కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో నెలబల్లి భాస్కర్ రెడ్డి, మట్టం శ్రావణి, బిల్లు చెంచు రామయ్య, వెంకటేశ్వరరాజు, సర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు కొనసాగించాలి




రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన వృద్ధాప్య, వితంతు పింఛన్లను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల గూడూరు మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, సివిఆర్ కుమార్, నగర కార్యదర్శి కాలేషా, నాయకులు చంద్రయ్య, నారాయణ, ఏకోబ్, బాలాజీ పాల్గొన్నారు.

## టూకీగా...



### పొదలకూరులో.. వైభవంగా ధనుర్మాస పూజలు

పొదలకూరులోని శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో డిసెంబర్ 24న వైభవంగా ధనుర్మాస పూజలు జరిగాయి. స్వామివారికి, అమ్మవార్లకు విశేషంగా అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ కర్తల ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ నిర్వాహకుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### కందుకూరులో.. సాయిచంద్‌కు సంఘీభావం

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయసాధన కోసం పాదయాత్ర చేస్తున్న సినీనటుడు త్రిపురనేని సాయిచంద్‌కు కందుకూరులో ఆర్యవైశ్యులు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర కందుకూరుకు చేరడంతో వారంతా ఎదురువెళ్ళి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్యవైశ్య నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ముత్తుకూరులో.. ఆక్వా జోన్‌పై అవగాహన

ముత్తుకూరు మండలంలోని మల్లూరు, పిడతాపోలూరు గ్రామాల్లో మత్స్యశాఖ అధికారులు ఇటీవల ఆక్వాజోన్ అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కలిగించారు. సర్పంచ్‌లు రామిరెడ్డి, కృష్ణవేణి, మండలపరిషత్ ఉపాధ్యక్షులు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సచివాలయ కన్వీనర్ శేషగిరి, సచివాలయాల మత్స్యశాఖ సహాయకులతో పాటు, ఎఫ్‌డిఓ సంజయ్, స్టీఫెన్ పాల్గొన్నారు.

### జమ్మిపాలెంలో.. మట్టి ట్రాక్టర్లు సీజ్

కోవూరు మండలంలోని జమ్మిపాళెం ప్రాంతంలో ఎలాంటి అనుమతిపత్రాలు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు వాహనాలను ఇటీవల పోలీసులు సీజ్ చేశారు. సెబ్ ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆ ట్రాక్టర్లను సీజ్ చేసి కోవూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

### మర్రిపాడులో.. వ్యాధుల నియంత్రణపై సమావేశం

మర్రిపాడు మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఇటీవల డాక్టర్ కల్పన విద్యార్థులతో సమావేశమై టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపట్ల వారికి అవగాహన కలిగించారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### తిమ్మాయిపాలెంలో.. పందెంరాయుళ్ళ అరెస్ట్

మర్రిపాడు మండలంలోని తిమ్మాయిపాలెంలో కోడి పందాలు ఆడుతున్నారన్న సమాచారంతో ఆత్మకూరు సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి అయిదుగురు పందెంరాయుళ్ళను అరెస్ట్ చేసి, వారి వద్ద రెండు కోళ్ళతో పాటు రూ. 27,850 స్వాధీనం చేసుకున్నారు. మర్రిపాడు ఇన్‌చార్జి ఎస్ఐ సాయిప్రసాద్, ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### బ్రహ్మదేవిలో.. పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ముత్తుకూరు సమీపంలోని బ్రహ్మదేవిలో జడ్పీహైస్కూల్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం డిసెంబరు24న సందడిగా జరిగింది. 2000-2004 మధ్య చదువుకున్న విద్యార్థులు పాల్గొని, నాటి రోజులను గుర్తుకుతెచ్చుని సంతోషించారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. విశ్రాంత హెడ్మాస్టర్ కొండయ్య, పూర్వ విద్యార్థులు డి.శ్రీనివాసులు, పట్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అమ్మవారిపాలెంలో... గొర్రెల అపహరణ

పొదలకూరు మండలంలోని అమ్మవారిపాలెంలో ఏటూరు ఆనంద్‌కు చెందిన గొర్రెలను ఎవరో దొంగలు తోలుకు పోయారు. దొడ్లో ఉన్న 50 గొర్రెలు, వాటిపిల్లలు మరో అయిదు డిసెంబరు 26 నుంచి కనిపించడం లేదని, దొంగలు అపహరించుకుపోయారని పోలీసులకు బాధితుడు ఫిర్యాదుచేశాడు. పొదలకూరు ఎస్ఐ కరిముల్లా కేసు నమోదు చేసి, దొంగల కోసం గాలిస్తున్నారు.

డిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

## నరాల వ్యాధులపై అవగాహన

- పాల్గొన్న డాక్టర్ బిందుమీనన్



నెల్లూరు సమీపంలోని నార్త్‌మోపూరు వద్దనున్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల మహిళలకు సంబంధించి ఆరోగ్య సదస్సు జరిగింది. ముఖ్యంగా నరాల వ్యాధుల నివారణ గురించి అవగాహన కలిగించారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ ఈ సదస్సులో పాల్గొని వ్యాధుల లక్షణాలను, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరంగా తెలియజేశారు. పక్షవాతం వచ్చే ముందు లక్షణాలు ఎలా ఉంటాయి, ఆ వ్యాధి రాకుండా ఏ విధంగా నిరోధించుకోవాలి, బ్రెయిన్ స్ట్రోక్ మరియు మూర్ఛ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తలనొప్పి, మైగ్రైన్, నడుము నొప్పులకు ఎలాంటి వ్యాయామాలు చేయాలో, ఎలాంటి చికిత్సలు చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మోపూరు చుట్టుప్రక్కల గ్రామాలనుండి మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. డిఎస్ఆర్ ట్రస్టు మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, ఫ్యాకల్టీ సుధాకర్, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీలో 'రిపబ్లిక్ డే' వేడుకలకు..

## ఎన్‌బికెఆర్ విద్యార్థిని



2023, జనవరి 26న న్యూఢిల్లీలో పెద్దఎత్తున జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని ఎంపిక య్యారు. ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ విభాగంలో తృతీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని కల్లూరి జాహ్నవి ఈ ఉత్సవాలకు ఎంపికైందని, కళాశాల నావెల్ వింగ్ ఎన్‌సిసి అధికారి డా. వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్యాడెట్ కెప్టెన్ కె.జాహ్నవిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, కళాశాలలోని అన్ని విభాగాల అధిపతులు అభినందించారు.

జిల్లాలో.. ఈ సీజన్‌లో

## 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

అధికారుల అంచనా

### కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఆ ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు అన్నిప్రాంతాల రైతులకు అందుబాటులో ఉండేవిధంగా, జిల్లాలో పెద్దసంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు సమాయత్తమయ్యారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కూడా ప్రకటించింది. సాధారణ రకం టన్నుకు 20,400 రూపాయలు, ఏ-గ్రేడ్ రకం ధాన్యం టన్నుకు 20,600 రూపాయలు ప్రకటించడంతో రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియలో ముఖ్యమైన తేమశాతం గుర్తించడంలో వస్తున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని, ఈసారి తేమశాతాన్ని కొలిచే పరికరాలు కూడా సమకూరుస్తున్నారు. శిక్షణ లేని సిబ్బందితో గతంలో రైతులు ఎంతో ఇబ్బందులు పడడాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు శిక్షణ కలిగిన సిబ్బందిని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటుచేస్తున్నారు. కొనుగోళ్ళకు అవసరమైన గోతాలను లక్షల సంఖ్యలో తెప్పించి సిద్ధం చేస్తున్నారు.



సిఎం జగన్ కృషితో..

## విద్యారంగంలో కొత్త వెలుగులు

### మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు కాకుండా, ఉన్నతమైన చూపులో ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ సంకల్పమని, అందుకే రాష్ట్రంలో సిఎం డిజిటల్ విప్లవానికి నాంది పలుకుతూ విద్యారంగంలో కొత్త వెలుగులు ప్రసరింపజేస్తున్నారని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. వెంకటగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ సందర్భంగా డిసెంబరు 27న జరిగిన కార్యక్రమంలో ఆనం మాట్లాడుతూ, విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆశయమన్నారు. పేదబిడ్డల బంగారు భవిష్యత్తుకోసం వైఎస్ జగన్ ముందుచూపుతో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెస్తున్నారని, కోట్లాదిరూపాయలు వెచ్చించి పాఠశాలల సమస్యలు తీరుస్తూ 'నాడు-నేడు'తో పాఠశాలల రూపురేఖలే మార్చేస్తున్నారని ఆయన కొనియాడారు. తొలుత, ఆయన వెంకటగిరిలో విద్యార్థులకి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి, వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, స్థానిక ప్రజా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బోగోలులో.. క్రిస్మస్ ఫుడ్‌బాల్ పోటీలు

మండలకేంద్రమైన బోగోలులో రైల్వే ఇంగ్లీష్‌మీడియం స్కూల్ క్రీడామైదానంలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని డిసెంబరు 24న ఫుడ్‌బాల్ పోటీలు నిర్వహించారు. వైకాపా యువత అధ్యక్షులు మేకల శ్రీనివాసులు ఈ పోటీలను ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్వహించిన ఈ క్రీడలు అందరినీ ఆకట్టుకున్నాయి.










# చెలగాటం.. ఇరకాటం!

(మొదటి పేజీ తరువాయి)

అధికార వ్యవస్థ(బ్యూరోక్రసీ)లో అలా కాదు. ఉద్యోగిగా పదవిలో కూర్చున్నప్పటి నుండి రిటైర్మెంట్ వరకు వాళ్ళు ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉంటారు. తమ హోదాను బట్టి, స్థాయిని బట్టి పదోన్నతి పొందుతూ వాళ్ళు కూడా ప్రభుత్వంలో ఉన్నతస్థితికి చేరుకుంటూంటారు. బదిలీలపై వివిధ ప్రాంతాలకు కూడా వెళ్తుంటారు. ఈ క్రమంలో భిన్న మనస్తత్వాలు కలిగిన రాజకీయ నేతలను, వారి అనుచరులను వందలమందిని చూస్తుంటారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనిచేస్తారు. సంబంధిత పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు ఆయా పార్టీల ద్వితీయశ్రేణి నేతలకు, కార్యకర్తలకు పనులుచేసి పెడుతుంటారు. పరస్పరం ఒకరికొకరు సహకరించుకుంటూ సహృద్భావ వాతావరణంలో ఎవరి పనులు వాళ్ళు చేసుకుపోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

అయితే, ఇప్పుడు కాలం మారింది. ఆధునిక రాజకీయ పోకడలు రాజ్యమేలుతున్నాయి. స్వార్థపూరిత విధానాలకు ప్రాధాన్యత ఏర్పడింది. 'మనం' అనే సంస్కృతి కనుమరుగై... 'నేను' అన్న సంప్రదాయం ఆచరణలోకి వచ్చింది. అధికార పార్టీ ఒక్కటే అయినా నేతలు వందమంది. ఎన్నికలలో పోటీచేసి గెలిచినవారు ఒకరైతే పెత్తనం చేసేది మరొకరు. మంత్రి, ఎం.పి., ఎం.ఎల్.ఏలతో పాటు వారి బంధువులకి, ముఖ్య అనుచరులకు, షాడో శక్తులకు అధికారులు సలాం కొట్టి గులాం కావలసి వస్తుంది. ఒకే పార్టీలో ఉన్న నేతల మధ్య లోపించిన సమన్వయం, ఆధిపత్య పోరులో ఏర్పడుతున్న వర్గవిభేదాల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రాలో రాజ్యమేలుతున్న నయా రాజకీయ విధానాలవల్ల అధికారులు విసిగిపోతున్నారు.

నా ముప్పై సంవత్సరాల సర్వీసులో ఇలాంటి నాయకులను, రాజకీయ పోకడలను తొలిసారి చూస్తున్నానని ఒక సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారి వాపోయారు. వీళ్ళతో వేగడంకన్నా డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లడం మేలని అనుకుంటున్నానని మరో కీలక అధికారి కామెంట్ చేశారు. ప్రజాక్షేత్రంలో గెలిచి ప్రజలకి సేవచేసే వారికోసం, ప్రజల అవసరాలు తీర్చడం కోసం, సమస్యలు పరిష్కరించడం కోసం తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని, ఇలా వాళ్ళ బినామీలు మాపై పెత్తనం చేయడాన్ని సహించలేకపోతున్నామని చాలామంది ఉన్నతస్థాయి అధికారులు తమ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

కొత్తగా విధులలో చేరిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఇలాంటి విధానాల పట్ల అవగాహన లేకపోవచ్చు కాబట్టి, ఇలా బినామీల జోక్యాన్ని వాళ్ళు పెద్దగా పట్టించుకోరు. సీనియర్ అధికారులు మాత్రం ఈ సంప్రదాయాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. రాజకీయ నాయకుల నియంతృత్వ పోకడల వల్ల అధికార వ్యవస్థలో వారిపట్ల అసంతృప్తి వ్యక్తమవుతోందని ఒక ప్రభుత్వ ఉద్యోగి చెప్పడం గమనార్హం. "కరవమంటే కప్పకు కోపం – విడవమంటే పాముకి కోపం" అన్న తరహాలో ఆంధ్రా నేతల ప్రవర్తన తయారయ్యిందని, మధ్యలో తాము నలిగి పోతున్నామని మరో సీనియర్ ఐపీఎస్ అధికారి అంటున్నారు. తమ బాధలు పట్టించుకునే ప్రభుత్వ పెద్దలు కూడా కరువయ్యారని, పైస్థాయిలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము యూనిఫామ్ వేసుకున్న రబ్బర్‌స్టాంపులా తయారయ్యామని తన భాధను వ్యక్తం చేశారు.

మొత్తంమీద రాజకీయ వ్యవస్థకి, అధికార యంత్రాంగానికి మధ్య సమన్వయం లోపించిందన్నది మాత్రం స్పష్టమవుతోంది. నేతలకు చెలగాటం.... అధికారులకు ఇరకాటంగా పరిస్థితులు తయారయ్యాయనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

# రాజ్యసభకి వై.వి.. శ్రీవారి సేవకి కరుణాకరరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కష్టపడ్డారు జగన్ బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డి. అయితే, పార్టీ అధికారంలోకి రాగానే ఆయనకి రాజకీయ ప్రాధాన్యత తగ్గించారన్న అసంతృప్తి అప్పటినుండీ సుబ్బారెడ్డి అభిమానులలో వ్యక్తమవుతూ వచ్చింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్ళీ సుబ్బారెడ్డికి ప్రాధాన్యత కల్పిస్తున్నారు జగన్. తాను, తన చుట్టూ పెట్టుకున్నవాళ్ళ వల్ల పార్టీకి నష్టమే తప్ప ప్రయోజనం లేదన్న వాస్తవాన్ని అధినేత గ్రహించారని, అందుకే అంకితభావంతో తన శ్రేయస్సు కాంక్షించే తన బాబాయ్ సుబ్బారెడ్డికే మళ్ళీ తగిన గౌరవం కల్పించబోతున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇదే జరిగితే భవిష్యత్తులో పార్టీకి అన్నీ మంచిరోజులు అన్న సంతోషాన్ని వై.వి. శక్తిసామర్థ్యాలు బాగా తెలిసిన ఆయన అభిమానులు వ్యక్తం చేస్తున్నారు.

# కరోనాతో అప్రమత్తంగా ఉండాలి

➢ **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పెంచలయ్య**

కరోనా మళ్లీ కోరలు చాస్తోందని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య జిల్లా ప్రజలను హెచ్చరించారు. ప్రపంచంలోని అనేకదేశాల్లో ఒమిక్రాన్ బిఎఫ్–7 వేరియంట్ కేసులు భారీసంఖ్యలో వస్తున్నాయని, కనుక ప్రజలు ముందుజాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. కోవిడ్ వైరస్ సోకిందనే అనుమానాలున్నవారికి వెంటనే పిహెచ్‌సి పరిధిలో కోవిడ్ టెస్ట్‌లు చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. విదేశాల నుంచి వచ్చేవారిపై నిఘాపెట్టి, కరోనా టెస్ట్‌లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కరోనా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, కోవిడ్ నిరోధానికి వేసే వ్యాక్సిన్ బూస్టర్ డోస్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని, మాస్కులు మరచిపోవద్దని కోరారు.

## నవరసాల నటుడు.. తెలుగువారి 'యముడు'...

# 'కైకాల'.. ఇక లేడు



*తెలుగోళ్ళ పాతతరం మహానటులు.. నవరసనటనా దురంధరులు.. ఒకరొకరుగా వెళ్ళిపోతున్నారు. అఖిలాంధ్ర ప్రేక్షకుల మనసులు దోచుకున్న అగ్రనాయకులు, ప్రతినాయకులు తెలుగువారికి కంటనీరు మిగిల్చి..ఒకరి వెంట ఒకరు..దూరతీరాలకు తరలిపోతున్నారు. మొన్నటికి మొన్న డ్యాషింగ్ హీరో..కృష్ణ.. ఆ తర్వాత..విలనీలో అగ్రతాంబూలం అందుకున్న కైకాల...నిన్నటికి నిన్న చలపతిరావు.. మృత్యుఒడికి చేరుకోవడంతో.. చిత్రసీమ విషాద సీమగా మారింది. అభిమానులు విలవిలలాడుతుంటే.. వెండితెర నాటి మెరుగులు మెరుపులు కోల్పోయి వెలవెలబోతోంది. ఎంతటి క్లిష్టమైన పాత్రనైనా అవలీలగా పోషించే విలక్షణ నటనా చాతుర్యంతో తెలుగు చలనచిత్రసీమకు ఎనలేని ఖ్యాతి తెచ్చిన నటసింహం.. కైకాల సత్యనారాయణ డిసెంబరు 23వ తేదిన, తన 87వ ఏట హైదరాబాద్‌లోని తన నివాసంలో అస్వస్థతతో... తుదిశ్వాస విడిచారు. ఆయన లేని లోటు ఎవరు తీర్చగలరు?...*

నటనలో మేటి...విలనీలో ఘనాపాటి!..విలక్షణ పాత్రల్లో..తనకు తనే సాటి!..ఆయనే కైకాల సత్యనారాయణ. అది సాంఘిక చిత్రమైనా, జానపదమైనా, పౌరాణికమైనా ఏదైనా సరే, తనకంటూ ఓ పాత్ర ఇస్తే చాలు..ఆ పాత్రకు జీవం పోసే మహానటుడు..కైకాల. ఆయన నటన ఎంతో విలక్షణంగా ఉంటుంది. డైలాగ్‌లు చెప్పే తీరే ఒక ప్రత్యేకతగా ఉంటుంది. 'ఆయ్!..యముండ' అని ఆయనంటే చాలు..నిజంగానే యముడొచ్చి హుంకరిస్తున్నట్లుగా ఉంటుంది. యముడంటే ఎలా ఉంటాడో.. కైకాలను చూస్తే..అచ్చం అలానే ఉంటాడనిపిస్తుంది. ఆ వేషం, పాత్రోచితంగా నటించే ఆ నేర్పు, ఆయనకు అత్యంత సహజం. అది నటన కాదు.. జీవించడమేననిపిస్తుంది. అందుకే ఆయన సహజనటులని ఖ్యాతిపొందారు. నవరసాలను సైతం అత్యంత సునాయాసంగా పోషిస్తూ.. 'నవరస నటనా సార్వభౌముని'గా విఖ్యాతి చెందారు. అటు పాతతరం, ఇటు నేటి కొత్తతరం ప్రేక్షకులకు ఆయనంటే అభిమానం. అది దుష్టపాత్ర అయినా, మంచిపాత్రే అయినా...ఆయన నటనంటే ఇష్టం.

## 60 ఏళ్ళలో..8 వందల సినిమాలు

కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామం ఆయన స్వస్థలం. 1935 జులై 25న ఆయన జన్మించారు. విద్యార్థి దశ నుంచీ నాటకరంగంపై ఆసక్తితో ఎన్నో నాటకాల్లో నటించారు. నటనారంగంపై మక్కువతో సినిమారంగంలోకి వచ్చి 1959లో 'సిపాయికూతురు' సినిమాలో హీరోగా తెరంగేట్రం చేశారు. ఇక అక్కడినుంచీ ఆయన వెనుదిరగలేదు. జానపదబ్రహ్మ విఠలాచార్య ప్రోత్సాహంతో విలన్ (ప్రతినాయకుడు)గా అనేక చిత్రాల్లో నటించి విలనిజానికే ప్రఖ్యాతిని తెచ్చారు. కరుణరసం ఒలికించే పాత్రలొచ్చినా సరే.. ఓకే అన్నారు. అమోఘమైన నటనతో అన్నిరకాల పాత్రల్లో రాణించారు. వందలాది చిత్రాల్లో అనేకరకాల పాత్రలు ధరించారు. పలానా పాత్రలో ఆయన బాగాలేరు..అన్న మాటే ఎక్కడా రాలేదు. ఏ పాత్ర ఇచ్చినా అందులో ఆయన ఇమిడిపోయేవారు. అందుకే తన 60 ఏళ్ల సుదీర్ఘ సినీజీవిత ప్రస్థానంలో దాదాపు 800 సినిమాలకు పైగానే నటించారంటే.. సినీప్రేక్షక లోకంలో ఆయన ప్రభావం ఎంతగా ఉండేదో తేటతెల్లమవుతుంది.

## విలన్ అంటే..కైకాలే

నిలువెత్తు రూపం, గంభీరమైన కంఠస్వరంతో సుయోధనుడిగా, రావణాసురునిగా, యమునిగా..ఏ పాత్రకాపాత్రే తన సొంతం అన్నట్లుగా నటించి, ఆ పాత్రలకే పేరు తెచ్చారు. శ్రీకృష్ణార్జున యుద్ధంలో కర్ణునిగా, నర్తనశాలలో దుశ్శాసనునిగా, పాండవ వనవాసంలో ఘటోత్కచునిగా, దానవీరశూర కర్ణలో భీముడిగా కైకాల నటన అద్భుతం.. అద్వితీయం. రాక్షసపాత్రలకు కూడా ఆయన జీవం పోశారు. విలన్ అంటే ఏమిటో తెలుగుప్రేక్షకులకు కన్నులకు కట్టినట్లు చూపారు. అదేవిధంగా సాంఘిక సినిమాల్లో ఎన్నో మంచిపాత్రల్లోనూ ఆయన నటన అమోఘం. ప్రతిపాత్రలోనూ ఆయన జీవించి.. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. సినిమాల్లో విలన్ అయినా, ఎన్నో దుష్టపాత్రలను పోషించినా..నిజజీవితంలో ఆయనెంతో సహృదయులు. ప్రజలంటే ఎనలేని అభిమానం. ప్రజలకు కూడా ఆయనంటే ఎంతో అభిమానం. అందుకే, మంచి నటునిగానేకాక, ప్రజాక్షేత్రంలోనూ ఓ మంచి నాయకునిగా.. పార్లమెంట్ సభ్యునిగా కూడా కైకాల సత్యనారాయణ తనదైన శైలితో రాణించి ప్రజాసేవలో తరించారు. అశేష ప్రేక్షకుల విశేషాదరణ పొందిన నవరస నటనాచతురుడు కైకాల... లేకపోవడం తెలుగు ప్రేక్షకలోకానికి తీరని లోటు.



## విలక్షణ నటుడు..

# చలపతిరావు..కన్నుమూత

విలక్షణ నటుడు..తెలుగు చలనచిత్ర రంగంలో తనదంటూ ప్రత్యేకముద్ర వేసుకున్న తమ్మారెడ్డి చలపతిరావు(78) డిసెంబరు 25న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మరణంతో తెలుగు సినిమా మరో మంచి నటుడిని కోల్పోయింది. సీనియర్ నటులు కృష్ణంరాజు, కృష్ణ, ఇటీవలే సత్యనారాయణ కొద్ది నెలల వ్యవధిలోనే ఈ లోకాన్ని వీడిపోవడంతో తెలుగు చిత్రరంగం విషాదంలో మునిగిపోయింది. అంతలోనే చలపతిరావు ఆకస్మిక మరణం టాలీవుడ్‌ను కలచివేసింది. కృష్ణాజిల్లా పామర్రు మండలం బల్లిపర్రు గ్రామంలో జన్మించిన చలపతిరావు, నటనారంగంపై మక్కువతో సినిమాల్లోకి వచ్చారు. ఎన్టీఆర్ అంటే తొలి నుంచీ అభిమానం. అదే ఆయన కెరీర్‌కు అండగా నిలిచింది. ఎన్టీఆర్‌తో కలసి పలు చిత్రాల్లో నటించే అవకాశం కలిగింది. ఎన్టీఆర్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'దానవీరశూర కర్ణ' చిత్రంలో ఎన్టీఆర్ మూడు పాత్రలు వేసి సంచలనం కలిగిస్తే, చలపతిరావుకు అందులో అయిదుపాత్రలు ధరించే అవకాశం లభించింది. అన్ని పాత్రల్లోనూ చలపతిరావు తనదైన నటనాచాతుర్యంతో ఆకట్టుకుని అందరినీ మెప్పించారు. యమగోల, డ్రైవర్‌రాముడు, సరదారాముడు, దొంగరాముడు, జస్టిస్ చౌదరి, బెబ్బులిపులి, కొండవీటి దొంగ, అన్నదమ్ముల అనుబంధం... ఇలా ఎన్నో చిత్రాల్లో ఆయన ఎన్టీఆర్‌తో కలసి నటించారు. విలక్షణ పాత్రల్లోనూ బాగా రాణించి ఎన్టీఆర్‌తో శెభాష్ అనిపించుకున్నారు. హాస్యంతో కలిసిన విలనీలో చలపతిరావు నటన అమోఘం. దాదాపు 1500కు పైగానే చిత్రాల్లో ఆయన నటించి క్యామెడీవిలన్‌గా ప్రఖ్యాతి చెందారు. ఎప్పుడూ నవ్వుతూ నవ్వించే చలపతిరావు కన్నుమూయడంతో అందరి కళ్ళు చెమ్మగిల్లాయి.

# ఎమ్మెల్యే ప్రసన్న.. మంత్రి కావాలి

## - ఎంపీ ఆదాల ఆకాంక్ష

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో రాష్ట్రంలోనే పదో స్థానాన్ని సాధించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని భవిష్యత్తులో మంత్రి పదవి వరించాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకూరుపేట మండలం, రాముడుపాలెం పంచాయతీ వెంకటేశ్వర పురం గిరిజనకాలనీలో డిసెంబర్ 26న ఆయన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి 'గడప గడపకు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మరికొన్ని రోజుల్లో ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి ప్రథమస్థానాన్ని సాధిస్తారని పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గం నుంచి మరో రెండుమూడు సార్లు ప్రసన్న ఎమ్మెల్యేగా ఎన్నికై అందరి ఆదరాభిమా



నాలు పొందాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, వైసీపీ నేతలు కళ్యాణ్‌రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, అల్లాబక్ష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'నాటా ఆట పాట'లో...
# అలరించిన 'మువ్వల సవ్వడి'.. 'పాటల సందడి'!

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన 'మువ్వల సవ్వడి' కార్యక్రమంలో తొలుత వాత్సల్య చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరి కరతాళధ్వనులందుకున్నాయి. ఆ తర్వాత 'నాట్యమయూరి' కుమారి ఆశ్రితారెడ్డి "వచ్చెను అలమేలుమంగా" అనే అన్నమయ్య కీర్తనకు చేసిన కూచిపూడి నృత్యం అందరి అభినందనలు అందుకుంది. అనంతరం 'కళాంజలి' అనంత్ పర్యవేక్షణలో జరిగిన 'పాటల సందడి' కార్యక్రమం సభికులను ఎంతగానో అలరించింది. 'ఆహా'.. ఇండియన్ ఐడల్ (తెలుగు)లోని టాప్-5 గాయనీ గాయకులైన జయంత్, వైష్ణవి, రేణుకుమార్, ప్రణతిలు పలు గీతాలను అద్భుతంగా ఆలపించి అందరి ప్రశంసలందుకున్నారు. 'ఓంకారనాదాను సంధానమౌ గానమే'.. అనే శంకరాభరణంలోని గీతాన్ని ఈ సందర్భంగా ఆలపించి, మన నెల్లూరు గానాల పట్టి, గానగంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీబి)ను స్మరించుకుంటూ ఆ పాటను ఆయనకు అంకితం చేశారు. ప్రముఖ యాంకర్ శ్రీమతి శ్యామల వ్యాఖ్యానం ఈ 'పాటల సందడి'కి మరింత హుషారునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని మరింత వీనులవిందు చేస్తూ సంగీత్ సౌరభ్, విజయ్ (కీ-బోర్డు), శాంతికుమార్ (తబలా), కోటి(ఫ్లూట్), నాని(జాస్), కిషోర్ (ప్యాడ్స్)లు వాద్యసహకారం అందించారు. వాత్సల్య చిన్నారుల నృత్యాల అనంతరం, 'యోగా'లో సుప్రసిద్ధురాలైన శ్రీమతి శృతకీర్తి యోగాసనాల ప్రాధాన్యతను వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేసి అందరికీ యోగ వైశిష్ట్యాన్ని తెలియజేశారు.

# కేసీఆర్, జగన్‌కు నాలుగు పక్కల నుంచీ...!



కేసీఆర్..., వై.ఎస్.జగన్!

ఇద్దరూ తమ తమ రాష్ట్రాలలో తిరుగులేని నేతలుగా ఎదిగినవారు. తమ తమ రాష్ట్రాలకు ముఖ్యమంత్రి పీఠాన్ని తమ తమ పద్ధతుల్లో సాధించినవారు. చెరొక ప్రాంతీయ రాజకీయపార్టీని పెట్టుకుని... ముఖ్యమంత్రులు అయినవారు. రాజకీయాలను కనుసైగతో నడపగలిగిన స్థాయికి చేరుకున్నవారు.

వారికి ఉన్న ప్రజాబలం, అసెంబ్లీలలో ఆధిక్యత, పాలనా యంత్రాంగంపై కమాండ్, ధన బలంతో... ఓ పదిహేను, ఇరవై ఏళ్ళ పాటు... హాయిగా, నిశ్చింతగా, ప్రశాంతంగా, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ లాగా తమ తమ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా కొనసాగ గలిగిన సామర్థ్యం కలిగినటువంటి నేతలు. ఈ ఇద్దరి రాజకీయాలకూ ఇన్ని పోలికలు ఉన్నాయి. ముఖ్యమంత్రులం కావాలనే కోరికను వినూత్న రాజకీయ వ్యూహాలను అవలంభించడం ద్వారా తీర్చుకున్న అపర మేధావులు కేసీఆర్, జగన్.

కానీ, క్షేత్రస్థాయిలో చూస్తుంటే... ప్రాక్టికల్‌గా పరిస్థితి వారికి అంత అనుకూలంగా లేదని విశ్లేషకులు అంటున్నారు.

ఆయా రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలు ఈ ఇద్దరికీ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయనే వాతావరణం... రెండు రాష్ట్రాల్లో పేపర్లు చదివేవారికి, టీవీ చూసేవారికీ కనిపిస్తుందని అంటున్నారు.

తెలంగాణ విషయం తీసుకుంటే... కేసీఆర్ గత తొమ్మిదేళ్లుగా ఎదురులేని ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఈసారి ఆయనను, 'ప్రగతి భవన్'(తెలంగాణ సీఎం అధికార నివాసం) చుట్టుపక్కలకు కూడా రానివ్వగూడదన్న కృత నిశ్చయంతో బీజేపీ విరుచుకుపడుతోంది.

బండి సంజయ్ నోరు..., బీజేపీ నేతల వ్యూహాలు, ఢిల్లీ నుంచి స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ప్రధాని, హోంమంత్రి, కేంద్ర మంత్రుల పర్యటనలు కేసీఆర్‌ను గానీ, ఇతర నేతలను గానీ ఊపిరి సలపనివ్వడం లేదు. పరస్పర విమర్శలు ఓ అయిదారు మెట్లు దిగేసి, వ్యక్తిగత స్థాయికి చేరాయి. బండి సంజయ్ నోటి దెబ్బను తట్టుకోలేని కేటీఆర్ - 'నువ్వు మనిషివా? పశువువా' అంటూ ఆ మధ్య ఆయాసపడిపోయారు. బీజేపీపై ప్రతి విమర్శలు చేసే 'డ్యూటీ' హరీష్‌రావుకు అప్పగించినట్టు ఉన్నారు. ఆయన ఆ పని చేస్తున్నారు.

మరోపక్క నుంచి ఈడీ, సీబీఐ రంగంలోకి దిగేశాయి. కేసీఆర్ కుమార్తె కవితకు ఢిల్లీ మద్యం కుంభకోణానికి ఒక లింకు కలిపారు. నిముషాల మీద ఈ 'కుంభకోణం'లో ఛార్జ్‌షీట్‌ను ఈడీ, ఢిల్లీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది.


మామూలుగా అయితే,ఛార్జ్‌షీట్ దాఖలు చేయడానికి సీబీఐ.... ఓ పదిహేను, ఇరవై ఏళ్ళ సమయం తీసుకుంటుందనే విమర్శలు దానిపై ఉన్నాయి. కానీ, విమర్శలను అది పట్టించుకోదు. అదే సమయంలో కొందరు బీజేపీ 'సన్నిహిత' వ్యక్తులైన స్వామీజీలు రామచంద్ర భారతి, సింహాయాజీ, మరో ఆసామితో కలిసి తెరాస ఎంఎల్ఏలతో బేరం ఆడడానికి హైదరాబాద్ వచ్చినప్పుడు పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. దాంతో బీజేపీ ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. ఈ కేసును సీబీఐకి అప్పగించండి అంటూ హైకోర్టుకు పరిగెత్తింది. బీజేపీ నేతల వాదనను హైకోర్టు సమర్థిస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు మీద సిట్ అప్పీల్‌కు వెళుతోంది.

ఈ న్యూసెన్స్ సరిపోదన్నట్టు ... పులి మీద పుట్ర అన్నట్టుగా రెండోపక్క నుంచి 'తెలుగు దేశం' పునః ప్రవేశం చేసింది. కేసీఆర్ ప్రభ... దివ్యంగా వెలుగుతున్నట్టుగా కనపడిన ఈ ఎనిమిదేళ్లల్లో తెలుగుదేశం చప్పుడుచేయలేదు.

చంద్రబాబు నివాసం,తెలుగుదేశం కేంద్ర కార్యాలయం హైదరాబాదే అయినప్పటికీ అసలు ఆ విషయమే గుర్తు లేనట్టుగా టీడీపీ పెద్దలు వ్యవహరిస్తూ వచ్చారు.

అయితే బీజేపీపై దూకుడుగా వెళ్లే క్రమంలో తెరాసను 'భారాస'గా మార్పు చేయడం, పులివెందుల బిడ్డగా ఉభయ రాష్ట్రాలలో ఇంటింటికీ తెలిసిన వైఎస్ కుమార్తె షర్మిల నోరేసుకుని కేసీఆర్‌పై పడిపోతూ తెలంగాణ అంతటా పాదయాత్ర చేయడం, అద్దూ అదుపూ లేని బీజేపీ వీర దూకుడు ప్రదర్శనతో కేసీఆర్ ఇరకాటంలో పడిపోతున్న భావం చాలా మందికి కలుగుతోంది. ఈ విమర్శలకు ఆయన అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే భావన తెలంగాణలో బాగా వ్యాపించడంతో... టీడీపీ కూడా రంగ ప్రవేశం చేసింది.

టీడీపీ అంటే.. కార్యకర్తల పార్టీ. హైదరాబాద్‌తో సహ ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ వంటి పలు ప్రాంతాలలో విస్తరించి ఉన్న ఎన్టీఆర్ అభిమానుల పార్టీ.




తెలంగాణలో కనీసం 30 నియోజకవర్గాలలో తిమ్మిని బమ్మి చేయగల పార్టీ.

ఇప్పుడు, టీడీపీని, బీజేపీని, షర్మిలను ఒక కూటమిగా కేసీఆర్‌పై వచ్చే ఎన్నికల్లో.. పోటీ చేయించాలనే ప్రయత్నాలు, 'సీరియస్'గానే మొదల య్యాయి. ఇలా ... కేసీఆర్ కొని తెచ్చుకున్న అనేక సమస్యలు... విఠలాచార్య జానపద సినిమాల్లోని భూతాల్లా నాలుగు పక్కల నుంచీ ఒక్కొక్క అడుగే ముందుకు వేసుకుంటూ కేసీఆర్‌ను చుట్టు ముడు తున్న వాతావరణం తెలంగాణలో కనిపిస్తోంది.

ఇవన్నీ దాదాపుగా ఆయన సృష్టించుకున్నవే.

1. అందరికీ నోరు తిరిగే తెరాసను .. 'భారాస'గా మార్చడం ....

2. మోడీతో పెట్టుకోవడం

3. కాంగ్రెస్‌ను, టీడీపీని తెలంగాణలో నేలమట్టం చేయాలను కోవడం...

మొదలైన అనేకానేక కారణాల బైప్రొడక్ట్సే ఈ సమస్యలు.

అసెంబ్లీ ఎన్నికలు ఆంధ్రాలో కంటే ఓ ఆర్నెల్లు ముందే తెలంగాణలో రావాలి.

కానీ, జగన్ దూకుడు చూస్తున్నవారు.. తెలంగాణ ఎన్నికలతో పాటే ఆంధ్రకు కూడా జరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

అయినప్పటికీ గత ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన భరోసా, ఆత్మ విశ్వాసం ఆయన మాటలలో వ్యక్తం కావడం లేదని విశ్లేషకులు అంటున్నారు. మిత్రపక్షం అనుకున్న బీజేపీ నేతలు కూడా ఎడాపెడా విమర్శలు గుప్పించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

టీడీపీ, జనసేన సభలకు... రోడ్‌షోలకు జనం పోటెత్తుతున్నారు. మరో పక్క వైసీపీలో ఏ స్థాయి నాయకుడూ రోడ్‌షో నిర్వహించే పరిస్థితులు కన పడడం లేదని పరిశీలకులు అంటున్నారు. జగన్ వ్యతిరేక మీడియా స్వైర విహారం చేస్తోంది.

మరోపక్క.... కేంద్ర పెద్దలకు - వైసీపీకి మధ్య దూరం పెరుగుతుందా? అనే ప్రచారం ఊపందుకుంటోంది. పార్లమెంట్ సభ్యుల ప్రశ్నలకు కేంద్రమంత్రులు ఇస్తున్న సమాధానాల తీరు కూడా ఈ అభిప్రాయానికి ఊతం ఇస్తున్నాయి.

ఉదాహరణకు

- పోలవరం సమయానికి పూర్తి కాకపోవడానికి ఏపీ ప్రభుత్వ వైఖరే కారణం
- కోటిపల్లి - నరసాపురం రైల్వేలైన్ పూర్తికాకపోవడానికి... రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము చెల్లించకపోవడమే కారణం. సుమారు 350కోట్లకు గానూ ఓ రెండున్నర కోట్లే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది.
- మహిళలపై అత్యాచారాలు, వారి గౌరవానికి భంగకరమైన దాడులలో ఏపీనే దేశంలో ఫస్టు.
- విదేశీ పెట్టుబడులు ఆకర్షించడంలో ఏపీ బాగా వెనకబడి ఉంది. పదో స్థానంలో ఉంది.
- కోర్టు ధిక్కార కేసులలో దేశంలో ఏపీ మొదటి స్థానంలో ఉంది.

ఇలా, సభ్యుల ప్రశ్నలకు కేంద్రమంత్రుల సమాధానాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంబరాసింగ్‌గా తయారయ్యాయి. దీనిని బట్టి, వైసీపీకి కేంద్ర బీజేపీ కొంచెం దూరం జరిగిందా అనే అనుమానాలు రాజకీయవర్గాలలో బయలుదేరాయి.

వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని కావచ్చు..., జగన్ ఢిల్లీ వెళ్లి బుధవారం నాడు ప్రధానిని కలిశారు. ఈ సమావేశంపై ఎవరి వ్యాఖ్యానాలు వారు చేస్తున్నారు.

అయినా సరే 175కు175 సీట్లు గెలిచి చూపిస్తామని జగన్ ప్రకటిస్తున్నారు. తన 'ఎలక్షనీరింగ్' తీరుతెన్నుల మీద, ఓటర్ల మైండ్‌సెట్ మీద ఆయనకు అంత నమ్మకం, పట్టు ఉండబట్టే ఆయన అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నారనడంలో సందేహం లేదని పలువురు భావిస్తున్నారు.

119కి 119 మా భారాసవే అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అనడం లేదు. లేదా 543కు 543 లోక్‌సభ సీట్లూ బీజేపీవే అని నరేంద్ర మోడీ కూడా అనడం లేదు.

తమ తమ రాష్ట్రాల్లో లభించిన అనితర సాధ్యమైన విజయాల వల్ల ఆవహించిన 'రాజకీయ విశ్వాసం' నుంచి ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు వ్యవహరిస్తున్నారు. ముందు... ముందు తమ ముందున్న ప్రతికూలతలను ఈ ఆత్మ విశ్వాసంతో ఎలా నెట్టుకొస్తారో చూడాలి!..

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com







జననం: 07-07-1932

మరణం: 5-01-2011

# 12వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

## శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు

(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్తులై తేది 05-01-2023 నాటికి
12 సంవత్సరాలు నిండనున్న సందర్భంగా
ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు
**డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి - డాక్టర్ శాంతి**
**ఎన్.వినోద్‌రెడ్డి - షాలిని**

కుమార్తెలు - అల్లుళ్ళు
**జి.సుప్రియ - జి.విజయసింహారెడ్డి**
**ఎన్.పద్మప్రియ - ఎన్.చంద్రారెడ్డి**

మనుమలు, మనుమరాండ్రు
**జి.అభిషేక్‌రెడ్డి, వైష్ణవి**
**జి.అనుదీప్, భావిక, రాహిల్, రుషిల్ సాకేత్,**
**విశాల్, మేఘన, హర్ష, సంజన, వినూష**

మునిమనుమరాలు - **అమైర, ఆరియ**

CRM IT Customer Success Partner | Fortune Summit business park NR Towers, BANGALORE.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com